నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

బుధవారం | 09 అక్టోబర్ 2024 | www.navatelangana.com

పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-మర్కుక్ : జిల్లాలో ఉన్న పరిశ్రమలన్నింటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, పర్మినెంట్, క్యాజువల్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వరదరాజపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. 1965 బోనస్ చట్టం ప్రకారం పరిశ్రమ లాభ నష్టాలతో సంబంధం లేకుండా కార్మికులందరికీ బోనస్ చెల్లించాలన్నారు. కనీస బోనస్ 7వేలు, లేదా 8.33శాతం లాభాల్లో ఉన్న 20 శాతం వరకు బోనస్ ఇవ్వాలని చట్టం తెలుపుతుందని తెలిపారు. వార్షిక ఏడాది 30 రోజుల్లో పని చేసిన బోనస్ ఇవ్వాలని చట్టం తెలుపుతుందని కానీ కొన్ని పరిశ్రమల యజమానియాలు చట్టాన్ని ఉల్లంగిస్తూ కార్మికులకు బోనస్ ఇవ్వడం లేదని అన్నారు. బోనస్ ఇవ్వని పరిశ్రమలన్నింటిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్మికులందరికీ బోనస్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులకు, ప్రభుత్వానికి సూచించారు. కార్మికులకు బోనస్ ఇవ్వని పరిశ్రమలపై ప్రత్యక్ష కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బాల్ లక్ష్మీ, జిల్లా నాయకులు వెంకటచారి, తదితరులున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన శ్రీనివాస్



నవతెలంగాణ-బెజ్జంకి

బీసీ జాతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పెద్దోళ్ల శ్రీనివాస్ కురుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనలో దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి సంబంధిత కార్యక్రమ మీడియా కవరేజ్‌ను మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఓసీ వర్గానికి చెందిన వ్యక్తి బీసీలను ఉద్దేశించి "అడుక్కునేవారు దానం చేసే వారిని విమర్శిస్తారా ఇదెక్కడి రాజకీయం రా బాబు"అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల శ్రీనివాస్ కురుమ తెలిపారు.

ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంత్రి రాక సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రితో ప్రత్యేక పూజలను నిర్వహింప చేశారు. అర్చకులు మంత్రికి ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ కమిటీ మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీనిత



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో మాజీమంత్రి హరీష్ రావు సతీమణి శ్రీనిత పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజులతో కలసి వివిధ వార్డులలో జరిగిన బతుకమ్మ ఉత్సవాలలో శ్రీనిత పాల్గొన్నారు. అనంతరం కోమటి చెరువు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు చీఫ్ మినిస్టర్ కప్

-జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట

పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతలను వెలికితీయడం కొరకు చీఫ్ మినిష్టర్ కప్-2024 ఒక చక్కటి వేదిక అని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాలోకి ప్రవేశించిన చీఫ్ మినిస్టర్ కప్ 2024 టార్చును సిద్దిపేట పట్టణంలోని సిరిసిల్లా రోడ్డులో పెద్దమ్మ దేవాలయం వద్ద నుంచి చీఫ్ మినిష్టర్ కప్-2024 టార్చ్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. టార్చ్‌ని పట్టుకుని క్రీడాకారులు, కోచ్‌లతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా యువజన, క్రీడా శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లాలో చీఫ్ మినిష్టర్ కప్-2024 టార్చ్ ర్యాలిలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ క్రీడల్లో జిల్లా నుంచి పాల్గొనే ప్రతి క్రీడాకారులను ఆల్ ద బెస్ట్ తెలియజేశారు. క్రీడల్లో జిల్లాను ఎంతో ముందుకు తీసుకెళుతున్న కోచ్‌లకు అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో ఆసక్తిగల ప్రతి ఒక్కరు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్దమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించి పెద్దమ్మ ఆశీర్వాచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి జయదేవ్ ఆర్య, క్రీడాకారులు, కోచులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు దోహదం





నవతెలంగాణ-దుబ్బాక రూరల్

గర్భిణీలకు రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు న్యూట్రిషన్ కిట్లు ఎంతగానో దోహదపడుతాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ అన్నారు. మంగళవారం అక్బర్ పేట-భూంపల్లి మండలం చౌదర్పల్లి గ్రామానికి చెందిన చుక్క రజిత, ఎనగూర్తి గ్రామానికి చెందిన కోతి మంజుల, ర్యాకం రేణుకలకు(గర్భిణీలకు) చీర సార్లతో పాటు న్యూట్రిషన్ కిట్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "మా ఇంటి మహాలక్ష్మి" కార్తీక అక్క సీమంతం కానుక కార్యక్రమం ద్వారా నియోజవర్గంలో 8 నెలలు దాటిన గర్భిణీలకు "టీమ్ కార్తిక ఫౌండేషన్ ద్వారా " న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రసవ సమయంలో తల్లి ఆరోగ్యంగా ఉండి పండింటి బిడ్డకు ఈ కిట్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రాజు, మాజీ సర్పంచ్ కొత్త రామానుజన్, సీనియర్ నాయకులు కొత్త దేవి రెడ్డి, మహేందర్ గౌడ్, వెంకటరెడ్డి, బోరు పోచయ్య, కుమ్మరి శ్రీనివాస్, నగేష్, దుబ్బరాజమ్, అంజయ్య, కామోజీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నగదు, బంగారు ఆభరణాలు చోరి



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తిలో మంగలి సాయికుమార్ దొంగలు చోరికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి సాయికుమార్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 4.5 తులాల బంగారు నగలు, 20 తులాల వెండి నగలు, నగదు రూ.4000లు చోరీ చేశారు. మంగళవారం సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండపోచమ్మ సాగర్...

డొంక లాగుతోన్న సర్కార్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

> మేడిగడ్డ బ్యారేజి కుంగుబాటుకు సంబంధించిన విచారణ జరుగుతున్న నేపథ్యంలోనే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌పై దృష్టి సారించింది. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం డొంకను లాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమై విచారణకు పూనుకుంది. పొలిటికల్‌గా మాజీ మంత్రి హరీశ్‌రావు టార్గెట్‌గా సర్కార్ కొండపోచమ్మ సాగర్ పనుల్లో జరిగిన తప్పిదాలను వెలికితీసే పనిలో పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై దూకుడుగా విమర్శలు చేస్తున్న హరీశ్‌రావు ఇప్పుడు సర్కార్‌కు టార్గెట్ అయ్యారు. అయితే కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో పలు అక్రమాలు జరిగినట్లు పిర్యాదులు అందిన నేపథ్యంలోనే ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించినట్లు చెబుతున్నారు. రంగంలోకి దిగిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సోమవారం నుంచే విచారణ షురూ చేశాయి.

- రంగంలోకి దిగిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు
- 2008 నుంచి వివిధ రికార్డుల పరిశీలనకు సిద్ధం
- ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు పిర్యాదులు
- హరీశ్‌రావు టార్గెట్‌గా సర్కార్ అడుగులు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆరా

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 13వ ప్యాకేజీ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని కొండపోచమ్మ సాగర్‌కు తరలించేలా ప్యాకేజి 14లో భాగంగా కన్వేయర్ సిస్టమ్‌లోని గ్రావిటీ కెనాల్ తవ్వకం, రెండు దశల పంపింగ్ వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన వివరాల్ని అడుగుతున్నారు. జలసౌధలో సోమవారం సోదాలు నిర్వహించారు. రిజర్వాయర్ వివరాలపై కూడా ఆరా తీశారు. స్టాండింగ్ కమిటీ, హై పవర్ కమిటీ మీటింగ్ మినిట్స్ ఇవ్వాలని ఇరిగేషన్ అధికారుల్ని ఆదేశించారు. 2008 నుంచి ఇప్పటి వరకు ఎజీ, కాగ్ రిపోర్టులు కూడా ఇవ్వాలని ఆదేశించారు. కాగ్, హై పవర్ కమిటీ తీసుకున్న నిర్ణయాలు, రికార్డులు, సైట్ ఇన్‌స్పెక్షన్ వివరాలు, రిపోర్టులు, స్టేట్ లెవల్ కమిటీ, ఐబీఎం రివ్యూ మీటింగ్ వివరాలపై లోతుగా విచారిస్తున్నారు. మంగళవారం సెంట్రల్ డిజైన్ ఆర్గనేజేషన్ (సీడీఓ) మాజీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, డైరెక్టర్ వర్క్ అకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మ నుంచి కూడా విజిలెన్స్ అధికారులు వివరాలు కోరారు.

పలు అక్రమాలు జరిగినట్లు పిర్యాదులు

కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్, కెనాల్స్, పంప్‌హౌస్ ఇతర పనుల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రభుత్వానికి పలు పిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. రిజర్వాయర్‌తో పాటు అప్రోచ్ చానల్, పంప్‌హౌస్ తదితర పనులను 14వ ప్యాకేజి కింద చేపట్టారు. తొలుత రూ.1332 కోట్ల అంచనా వ్యయం కాగా వాటిని సవరించి రూ.2281 కోట్లకు పెంచారు. ఆ తర్వాత రూ.2898 కోట్లకు పెంచి పనులు చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం మొదట్లో వేసిన అంచనా వ్యయం, ఆ తర్వాత పెంచిన వ్యయంలో అవినీతి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయానికి మించి అంచనాల్ని పెంచుకుని అవినీతికి పాల్పడినట్లుగా చెబుతున్నారు.

హరీశ్‌రావు టార్గెట్ అయ్యారా..?

రాజకీయంగా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఇరగాటంలో పెడుతూ దూకుడుగా విమర్శలు చేస్తున్న విపక్ష నాయకుడుగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఉన్నారు. ఇప్పటికే మేడిగడ్డ కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు ప్రభుత్వం చెబుతోంది. మాజీ సీఎం కేసీఆర్ అవినీతికి పాల్పడినట్లుగా ప్రచారం చేయగలిగారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను టార్గెట్ చేయగల్గిన ప్రభుత్వం తాజాగా హరీశ్‌రావును టార్గెట్ చేసేందుకు కొండపోచమ్మ రిజర్వాయర్ పై విచారణకు పూనుకుంది. హరీశ్‌రావు ఇరిగేషన్, ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే కొండపోచమ్మ సాగర్ పనులు జరిగాయి. అందుకే ఆయన్ను అవినీతి పరుడుగా తేల్చేందుకు సర్కార్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ను రంగంలోకి దించిందనే చర్చ నడుస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా పోరాటాలే మార్గం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రి ముచ్చాల గ్రామ శాఖ మహాసభ బోడిగం వరలక్ష్మి చుంచు దేవకుమార్ సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభ శుభ సూచనగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తానని, నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తానని, రైతులకు స్వామినాథం కమిషన్ సిఫారసుల అమలు చేస్తానని వాగ్దానం చేసి ఎన్నికల తర్వాత వాటి ఊసేత్త కుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి ఆరు





గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేయలేదని, రైతుబంధు ఇప్పటివరకు వారి ఖాతాలో వేయలేదని, మహిళలకు ఆర్భాటంగా ప్రకటించిన మహాలక్ష్మి పథకం కింద రూ. 2500 అమలు కాలేదని, 500 గ్యాస్ పథకం కూడా ఏ ఒక్క కుటుంబానికి రావడం లేదని, వాగ్దానాలు గానే మిగిలేనాయే తప్ప ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలని రైతులకు అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. మర్రి ముచ్చల గ్రామంలో నెలకొన్న వీధిలైట సమస్య, డ్రైనేజ్ దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, వీటితోపాటు గ్రామంలో నెలకొన్న ప్రతి సమస్యపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం చేయాలని ఈ మహాసభ తీర్మానం చేసింది. ఈ మహాసభలో బోడిగం సురేందర్ రెడ్డి, దెబ్బేట బాల నర్సయ్య పాచికంటి బాలరాజు, బోడిగం వరలక్ష్మి లను, మహాసభ శాఖా కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు

పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

- గ్రామ సమస్యల పరిష్కారంలో సీపీఐ(ఎం) ముందుంటుంది
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్

నవతెలంగాణ-చేర్యాల

పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చిట్యాల గ్రామంలో మంగళవారం గ్రామ సీపీఐ(ఎం) శాఖ మహాసభలు నిర్వహించారు. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విచ్చలవిడిగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని, పెరిగిన ధరల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెట్రోల్ ధరలు పెరగడంతో నిత్యావసర ధరలు కూడా ఆకాశాన్ని అంటాయని అన్నారు. ఈ మధ్యకాలంలో మంచి నూనె ధర కిలో ప్యాకెట్ కు అదనంగా రూ. 40 పెరిగాయని వాపోయారు. పప్పులు, ఉల్లిగడ్డ, అల్లం ఎల్లిగడ్డ, కూరగాయలు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల సామాన్యుడు కొనలేని స్థితి ఏర్పడుతుందని అన్నారు. పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని లేకుంటే ప్రజా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. గ్రామంలో విపరీతంగా కోతులు ఉండడంతో రైతుల పంటలను పాడు చేస్తున్నాయని, కూరగాయలు పండించే పరిస్థితి లేదని కోతుల వల్ల నిత్యావసర వస్తువుల్లో భాగమై న కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రభుత్వం వెంటనే కోతుల బారి నుంచి రైతుల పంటలు కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని కుటుంబాలు సుమారు 100 ఉంటాయని నూతనంగా రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను



పేదలందరికీ నిర్మించి ఇవ్వాలని, రేషన్ కార్డులు మంజూరు చేసి బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని, దొడ్డు సన్నధాన్యము అని తేడా లేకుండా మార్కెట్‌కు వచ్చిన ధాన్యానికి బోనస్ క్వింటాలకు రూ.500 రైతులకు అందించాలని, 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. మహిళా సంఘాల ద్వారా డ్వాక్రా మహిళలందరికీ వడ్డీ లేని రుణాలు అందించాలని కోరారు. మహాసభలో చిట్యాల గ్రామ మొదటి శాఖకు మల్కని ఎల్ల య్య, రెండవ శాఖకు బొడిగం చంద్రారెడ్డి, సోషల్ మీడియా గ్రామ బాధ్యునిగా దాకి మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. మహాసభలో ఆ పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, చేర్యాల పట్టణ కమిటీ సభ్యులు బోయిని మల్లేశం సుర్ణ తిరుపతి, ఎల సాంబయ్య, బొంజురు ఎల్లయ్య, గంగర సిద్ధులు, బంగారి రమేష్, రాములు, బొడ్డు రాజు, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు

నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడేది సీపీఐ(ఎం)

- ఇజ్రాయేల్ దుచర్యను వ్యతిరేకించాలి
- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడేది సీపీఐ(ఎం) పార్టీ అని సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అన్నారు. సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభ మద్దూరి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కాముని గోపాలస్వామి మాట్లాడు తూ.. సీపీఐ(ఎం) ఎర్రజెండా వెలుగులోనే ప్రజా సమస్యలు పరిష్కరించబడతాయని గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యల పైన నిరంతరం పార్టీ సభ్యులు ప్రజలను ఐక్యం చేస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామంలో రైతులకు పంట ఆరబెట్టుకోవడానికి మార్కెట్ యార్డ్ లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం మార్కెట్ యార్డ్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయేల్ పై భారత ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయేల్ చేస్తున్న దురాక్రమణ పూరిత యుద్ధ దాడులతో పాలస్తీనా అతరాకుతలం అయిం దన్నారు. ఉద్దేశపూర్వకంగానే పాఠశాలలు ఆసుపత్రు లను, పిల్లలను, లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయేల్ దాడులకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా వెనుక ఉండి ఇదంతా నడిపిస్తుందన్నారు. ఈ మరణ కాండను ఆపాలని అంతర్జాతీయ న్యాయస్థానం కోరినప్పటికీ ఇజ్రాయేల్ పెడ చెవిన పెట్టిందన్నారు



.ఈ దుచర్యను వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించాలని ప్రజలకు ప్రజాతంత్ర వాదులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ప్రారంభ ఉపన్యాసం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ... రజాకార్లకు వ్యతిరేకంగా భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిపిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని ఆ పోరాట చరిత్రను పునికిపుచ్చుకొని మనమంతా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ప్రజలను సమీకరించుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట రూరల్ మండల కార్యదర్శి మామి డాల కనకయ్య, పులి పరుశరాములు, దుబ్బ యాదయ్య, మల్లేశం, తదితరు పాల్గొన్నారు. అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా చింతల వెంకటయ్య ,గ్రామ సోషల్ మీడియా కన్వీనర్‌గా దుబ్బ కనకయ్యను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కుమ్మరులకు కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కుమ్మరులకు కార్పోరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని అఖిల భారత కులాల కుంభార్ (కుమ్మరి) ప్రజాపతి సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి సంఘం అధ్వర్యంలో సిద్దిపేటలో రాష్ట్రస్థాయి కుమ్మర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కుమ్మరులు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగాలని, రాజకీయంగా ఎదుగుదలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరులకు టికెట్లు కెటాయించాలని, అలాంటి పార్టీలకు కుమ్మరుల మద్దతుంటుందని, కార్పోరేషన్, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్య అతిథి వేలాద్రి మాట్లాడుతూ.. కుమ్మరులను బీసీ-బీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని, గెజిట్లో ప్రజాపతి అనే పదాన్ని చేర్చి ఆత్మగౌరవం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరుల సంక్షేమానికి చెందిన చట్టాలన్ని అమలు చేయలని, పాటరీ శిక్షణ కేంద్రాలు మండల, జిల్లా స్థాయిలలో ఏర్పాటు చేయలని, కుమ్మర వృత్తిదారులు, కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, వృత్తి విద్యా కోర్సుల్లో పాటరీ డిజైన్‌అను పాఠ్యాంశాన్ని ఏర్పాటుచేయలని, కవయిత్రి మొల్ల, వరకవి సిద్ధప్ప, జస్టిస్ కుమారయ్య లాంటి మేధావుల విగ్రహాలు ప్రధాన కూడళ్లలో ప్రతిష్టించాలని, రాష్ట్రంలో కనీసం 13 ఎమ్మెల్యేలు, 4 ఎంపీ స్థానాలు కుమ్మర్లకు కేటాయించాలని తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ఈ సమవేశంలో ఉమ్మడి జిల్లా నాయకులు చాతరాజు సత్యం, గూపల్లి ఆంజనేయులు, రాదారి నాగరాజు, దరిపల్లి నగేష్, దరిపల్లి శ్రీనివాస్, కందికొండ లమర్ వాచరవేణి పర్శారాములు, తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట స్వాతంత్ర్య సమరయోధుడు మృతి


నేడు జోగిపేటలో అంత్యక్రియలు..



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గడీండ్ల లింగమయ్య గౌడ్ (96) మంగళవారం తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు అసుపత్రిలో చికిత్స పొం దుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. 1928 నవంబర్ 15న జన్మించిన ఆయన.. దేశ స్వాతంత్రం కోసం జరిగిన ఉద్యమ ంలో చురుగ్గా పాల్గొన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తర్వాత ఏర్పడిన భారత దేశ ప్రభుత్వం నుంచి ఆయన తామర పత్ర గ్రహిత ఆవార్డును అందుకు న్నారు. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కూడా ఆయన కీలక పాత్రను పోషించారు. అప్పటి నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను చేపట్టారు. ఉద్యమ సమయంలో జైలు జీవితాన్ని సైతం గడిపారు. జోగిపేటలో జరిగిన ఉద్యమ కార్యక్రమాలలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రతి ఏడాది ఆగస్టు 15న స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను సన్మానిస్తూ గౌరవిస్తున్నారు. ఆయన మృతి చెందడం పట్ల రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసం ఘాల నాయకులు, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమక ారులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నేడు(బుధ వారం) జోగిపేటలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాకర్ పట్టివేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ని ఎస్సై అభిలాష్ మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం రావడంతో గ్రామ శివారులో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమాని శివరాత్రి అశోక్‌పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా మత్స్యశాఖ అధికారికి సన్మానం

నవతెలంగాణ-జిన్నారం



సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ నూతన అధికారి నర్సింహారావును ఊట్ల గ్రామస్తులు మత్స్య శాఖ డైరెక్టర్ ఊట్ల సుంకరబోయిన మహేష్ నేతృత్వంలో మంగళవారం ప్రత్యేకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు సంబంధించిన వివిధ అంశాలను వివరించినట్టు మహేష్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతపల్లి వెంకటేష్, లక్ష్మణ్ వవీరబోయిన సాయి కుమార్, దాదిగుడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దాది రమేష్ బృందం పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడపొద్దు

నవతెలంగాణ-పటాన్‌చెరు



ట్రాఫిక్ నిబంధనలు తూ.చా తప్పకుండా ప్రతి ఒక్కరు పాటించాలని, తాగి వాహనాలను నడపొద్దని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐలు లాలూ నాయక్‌లు అన్నారు. పటాన్‌చెరు పట్టణ డీసీఎం వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఏర్పాటు చేసుకున్న సందర్భంగా మంగళవారం డీఎస్పీ రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్‌లను వేరువేరుగా కలిసి బోకే అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మరియు ట్రాఫిక్ సీఐలు మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనలు నడపొద్దన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని, డ్రైవర్లు జాగ్రత్తగా లేకపోతే రెండు వైపులా నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి కృష్ణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం ఆదర్శ కళాశాలకు చెందిన పదిమంది ఒకేషనల్ విద్యార్థులకు బ్యూటీ పార్లర్ కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో పది రోజుల పాటు అవగాహన కల్పిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీదేవి తెలిపారు. బ్రైడల్ మేకప్, ఫేషియల్స్, మెనిక్యూర్, బ్లీచ్ టన్, హెయిర్ స్టైల్, ఐబ్రోస్, మెహిందీ, బేబీ కట్స్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రొప్రైటర్ జి.స్రవంతి, ఒకేషనల్ ట్రైనర్ జి.సంతోషి తెలియజేశారు.కార్యక్రమంలో నవ్య, యామిని, మీనాక్షి, ప్రియ కుమారి, బందన కుమారి, మధుమతి, రేవతి, రేణుక, ఎస్ కే సల్మా, నిఖిత తదితరులు పాల్గొన్నారు.



నేడు మండలానికి మంత్రి రాక

నవతెలంగాణ-రాయికోడ్

నేడు మండల కేంద్రమైన రాయికోడ్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నేడు విచ్చేయుచున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ గొల్ల అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు తెలిపారు. రాయికోడ్, మునిపల్లి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్స నేడు(బుధవారం) మండల కేంద్రంలో జరగనున్నది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వారు తెలిపారు. ఈ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌ను పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైకోడ్ తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పాటిల్, బాబు ,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి ఏఎంసీ పాలకవర్గం ఏకగ్రీవం




నవతెలంగాణ-వట్‌పల్లి

వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా లక్ష్మీ, వైస్ చైర్మెన్‌గా ఈశ్వరయ్యతోపాటు పాలకవర్గం కూడా ఏకగ్రీవం జరిగింది. 10 నెలలుగా ఏఎంసీ పాలకవర్గ పదవుల కోసం ఎంతోమంది ప్రయత్నాలు చేశారు. అయితే ఎంపిక ప్రక్రియను మండల నాయకులపైనే మంత్రి పెట్టడంతో.. రెండ్రోజుల క్రితమే రోజుల క్రితమే చైర్మెన్, వైస్ చైర్మెన్‌ల ఎంపిక పూర్తి కాగా మంగళవారం ఏకాభిప్రాయంతో డైరెక్టర్ల ఎంపిక పూర్తయింది. రేగోడుకు చెందిన పజిల్, ఆరు ఇటిక్యాల లక్ష్మయ్య, మర్పల్లి భద్రరెడ్డి, శ్రీధర్ గుప్తా ట్రేడర్, కొండాపూర్ సంగమేశ్వర్, వట్టిపల్లి మండలానికి చెందిన షాద్నగర్ నాగయ్య, వట్పల్లి డిగంబర్, కేరూరు పాపయ్య, పోతుల బొగుడ హబీబ్ భాయి, అల్లాదుర్గం మండలానికి చెందిన మద్దూరి రాజు గౌడ్, నడమి తాండ దేవసోత్రాజు నాయక్, పెద్దాపురం కుమార్ సాయిలు డైరెక్టర్లుగా ఏకగ్రీవం అయ్యారు. కమిటీ పాలకవర్గం త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



దుర్గామాత మండపంలో కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ పూజలు

నవతెలంగాణ-గుమ్మడిదల

దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గుమ్మడిదల

మండలంలోని దోమడుగు గ్రామంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాతకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, అమీన్ పూర్ 15వ వార్డ్ కౌన్సిలర్ కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్రతీయేటా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరపడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు.



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలోని స్థానిక వనదుర్గ దేవాలయం ప్రాంగణం వద్ద మా దుర్గా భవాని దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మా దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వాహకులు భక్తులు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, జిన్నారం పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా చంద శ్రీధర్

నవతెలంగాణ-సంగారెడ్డి



పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా చంద శ్రీధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్య క్షులు పింగళి శ్రీపాల్ రెడ్డి ఉత్తర్వు లు జారీ చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు గాను ఈ నియామకం జరిపినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రమాణ స్వీకారం హైద్రాబాద్‌లో ఉంటుందన్నారు.

రైతు కష్టం కన్నీటిపాలు

- ఇటీవల వచ్చిన తుఫాన్లతో దెబ్బతిన్న పంట చేన్లు..
- పెట్టుబడి కూడా వచ్చే దుస్థితి లేదు
- అన్నదాతల ఆవేదన



నవతెలంగాణ-పుల్కల్

కడుపు నింపే అన్నదాతలకు పస్తుల తిప్పలు తప్పేలా లేవు. విత్తనాల నుంచి మొదలుకొని ధాన్యం విక్రయిస్తే చేతి కొచ్చే డబ్బుల వరకూ.. ప్రతీదీ రైతు గుండెపై ఓ గుదిబండలా మారుతుంది. కల్తీ విత్తనాల నుంచి ప్రతికూల వాతావరణ పరిస్థితుల వరకు ప్రతీ ఒక్కటి అన్నదాతకు నష్టాన్ని మిగుల్చుతూనే ఉన్నాయి. కాగా గత కొన్నేండ్లు అతి, అనా వృష్టి వర్షాలు రైతన్నను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి.ఈ యేడు కూడా సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక విత్తనాలు నాటుకోవడానికి రైతులు ఇబ్బంది పడగా.. పంటలు ఏపుగా పెరిగి చేతికొస్తున్న సమయంలో తాజాగా ఇటీవల కురిసిన వర్షాలకు పంటలన్నీ దెబ్బతిన్నాయి. దాంతో కనీసం పెట్టుబడి కడా వస్తుందో లేదో అని రైతులు ఆందోళన పడుతున్నారు.

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో సుమారు 15,658 మంది రైతులు.. 1840 ఎకరాల్లో వరిపంట, 12,650 ఎకరాల్లో పత్తి, 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 518 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. కాగా రోజుల తరబడి కురిసిన వర్షాలకు పత్తి, కూరగాయల పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలో పత్తి చేన్లు పూత దశలో ఉన్నప్పుడు కూడా భారీ వర్షాలు కురిశాయి. దాంతో పూత మొత్తం రాలిపోయి చాలా నష్టం జరిగింది. మిగిలిన కాసింత పంటలో ప్రస్తుతం పత్తి కాయలు పక్వానికి వచ్చి పంట చేతి కొచ్చే దశలో ఉన్నది. ఈ క్రమంలో ఇటీవలే రోజుల తరబడి కురిసిన భారీ వర్షాలకు పత్తి చేన్లలో నీళ్లు నిలిచాయి. దాంతో చాలా వరకు పంట ఎర్రబడి పోవడం జరిగింది. అంతేకాకుండా అధిక మొత్తంలో కాయలు కుళ్లిపోయాయి. దాంతో పెద్ద మొత్తంలో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సర్వే చేపట్టి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. అందోల్ నియోజకవర్గం నుంచి గెలిచిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి.. ఇక్కడి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు భేల్ భవన్స్ విద్యార్థి

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భేల్ టౌన్షిప్‌లో గల భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని హెూనీషా జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించింది. సెప్టెంబర్ నెలలో తమిళనాడులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 20-22 కిలోల విభాగంలో పాల్గొని హనీషా బంగారు పతకం సాధించింది. ఉత్తరాఖండ్‌లో అక్టోబర్ 9 నుండి 13వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి హనీషా అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, హెడ్ మిస్సెస్ భాను నిర్మల మరియు పిఈటీ విభాగం విద్యార్థిని హెూనిషాను అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్న హెూనీషా ముందు మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా కలెక్టరెట్ కార్యాలయంలో 7వ రోజు వేపకాయల బతుకమ్మ సంబురాలను తెలంగాణ టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు జావేద్ అలీ, సంఘం సెక్రటరీ రవి, టీఎన్జీవో సభ్యులు కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్ఓ పద్మజారాణి హాజరై.. బతుకమ్మ ఉత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మను ప్రతిబింబించే ఒక ముఖ్యమైన ఉత్సవమన్నారు. మహిళలు దీన్ని చాలా ప్రేమతో జరుపుకుంటారని ఈ పండుగ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని సూచిస్తుందన్నారు. సంస్కృతీ, సాంప్రదాయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈ బతుకమ్మ వేడుకల్లో వేపకాయలతో ప్రత్యేక అలంకరణ చేయడం విశేషమన్నారు. వేపకాయలను ఉపయోగించి బతుకమ్మను నిర్మించడం, తద్వారా ప్రకృతిని, ఆరోగ్యాన్ని ప్రతిబింబించ ఎకోవడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, వెంకట రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, గౌస్ ఆస్మి సుధా మణి, సుధారాణి, శ్రీవాణి, పట్టణ శాఖ అధ్యక్షులు శివరాజ్ కార్యదర్శి యాదవ రెడ్డి, వివిధ కార్యాలయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేశారు.

మట్టిలో మాణిక్యం

ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించి పేదింటి బిడ్డ



నవతెలంగాణ-కల్హేర్

మోడల్ పాఠశాలలో పదో తరగతి.. సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఇంటర్మీడియట్ చదివిన ఓ పేదింటి విద్యార్థిని ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించి.. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. మండలంలోని మహదేవ్‌పల్లి గ్రామానికి చెందిన పేదరైతు చింతకాయల రాములు, సునంద దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. రాములు వ్యవసాయం చేస్తూ కూలీనాలి పనులు చేస్తూ ముగ్గురు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కాగా వారి చిన్నకూతురు శిరీష మొదటినుంచి చదువులో చురుకుగ్గా ఉండేది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట పట్టణంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివిన ఆమె 10/10 జి పి సాధించింది. తర్వాత సోషల్ వెల్ఫేర్ గురుకులం చిట్కుల్ ఇస్నాపూర్‌లో ఇంటర్మీడియట్ చదివి 955 మార్కులు సాధించింది. అలాగే 2023-2024కు సంబంధించి నీట్ పరీక్ష రాసి ఆల్ ఇండియా 163429, స్టేట్‌లో 2781 ర్యాంక్ సాధించింది. కాగా సోమవారం వెలువడిన కౌన్సిలింగ్ ఫలితాల్లో జగిత్యాల గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌లో ఉచిత ఎంబిబిఎస్ ఉచిత సీటు సాధించి 'మట్టిలో మాణిక్యం'గా నిరూపించింది. కృషి పట్టుదలతో చదివి తమ గ్రామానికి వన్నెతెచ్చిన శిరీషను ఆమె తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

మరిన్ని ఆవిష్కరణలు చేయండి



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతంలోని విద్యార్థి క్లబ్స్‌లో ఎంతో ప్రభావశీలంగా నడుస్తున్న జీ-ఎలక్ట్రా క్లబ్ మరిన్ని ఆవిష్కరణలు చేసి మరింత ఉజ్వలంగా ప్రభవించాలని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్-కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రామశాస్త్రి అభిలాషించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలోని జీ-ఎలక్ట్రా క్లబ్ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం అత్యంత ఉత్సాహంగా జరిపారు. సాంకేతిక ఆవిష్కరణల పట్ల మక్కువను పెంచడం, గాడ్జెట్ల ఆటోమేషన్‌లో పురోగతిని అన్వేషించడంతో పాటు, నూతన సాంకేతికతలను స్వీకరించడం లక్ష్యంగా ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీ-ఎలక్ట్రా కొత్త వెబ్ సైట్ ను స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవిలతో కలిసి ప్రొఫెసర్ శాస్త్రి ఆవిష్కరించారు. ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 22 సాంకేతిక ప్రదర్శనలలో అత్యుత్తమమైన వాటిని అవార్డులను అందజేశారు. ప్రాజెక్టు ఎక్స్‌పో విజేతలకు ప్రశంసా పత్రాలను, మెమొంటోలను ప్రదానం చేశారు. గీతం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు జీ-ఎలక్ట్రా విద్యార్థులను అభినందించారు. టెరిటోరియల్ ఆర్మీ నుంచి జాతీయ బహుమతి గ్రహీత ప్రణవ్‌ను వారంతా ప్రత్యేకంగా ప్రశంసించారు. గీతంలోని అత్యంత చురుకైన క్లబ్ లలో ఒకటిగా జీ-ఎలక్ట్రాను డాక్టర్ మాధవి అభివర్ణించారు. ఈ క్లబ్ సభ్యులు ఏ పోటీకి వెళ్లినా అవార్డులతో తిరిగొస్తారని డీవీవీఎస్ఆర్ వర్మ ప్రశంసించారు. తొలుత, జీ-ఎలక్ట్రా అధ్యక్షుడు పల్లె దీపక్ వార్షిక నివేదికను సమర్పించగా, అధ్యాపక సమన్వయ కర్తలునరేష్ కుమార్, డాక్టర్ అనితలు సమన్వయం చేశారు.

కార్మిక పోరాటాలు మరింత బలోపేతం

- వాగ్వాల్స్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య
- సీఐటీయూకు కార్మికుల ఉద్యమ నిధి అందజేత

నవతెలంగాణ-పటాన్‌చెరు



కార్మికుల చట్టపరమైన హక్కుల కోసం కార్మిక పోరాటం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉన్నదని వాగ్వాల్స్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య అన్నారు. మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల వాగ్వాల్స్ పరిశ్రమలో వేతన ఒప్పందం అయిన సందర్భంగా పెరిగిన ఒక నెల వేతనాన్ని సీఐటీయూ ఉద్యమనిధి కోసం యూనియన్ అధ్యక్షులు కే. రాజయ్యకు కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధి అందించినా కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధిని కార్మిక ఉద్యమాలకు ఖర్చు చేస్తామన్నారు. కార్మిక పోరాటాలను మరింతగా బలోపేతం చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా సీఐటీయూ ఉద్యమాలు నిర్వహిస్తున్నదన్నారు. కార్మికులకు అండగా, కార్మికులకు రక్షణగా సీఐటీయూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆఫీజ్, మురళి,డేవిడ్ రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఖేడ్ ఏరియా కార్యదర్శిగా రమేష్

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శిగా నల్లవల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖేడ్‌లో ఇటీవలే జరిగిన సీపీఐ(ఎం) ద్వితీయ మహాసభలో ఏరియా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ(ఎం) ఉద్యమిస్తుందన్నారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల సమస్యలపై మహాసభలో పలు తీర్మానాలు చేసినట్టు చెప్పారు. పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అప్పుడు మాత్రమే కొంత వలసలు తగ్గుతాయన్నారు. మినీ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ఏరియా హాస్పిటల్ అన్ని రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు ఎంఆర్ఐ వంటి పరీక్షలు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని.. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారానికి మహాసభ డిమాండ్ చేసిందన్నారు. అలాగే సాగు, తాగునీరు ఇవ్వాలని.. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ అందరికీ చేయాలని, నల్లవాగు ప్రాజెక్టు నుండి కల్హేర్ మండలానికి రెండో పంటకు నీళ్లు ఇవ్వాలని, కనీస వేతనాలు రూ.26,000 పెంచాలని ధరణిలో నెలకొన్న భూ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని మహాసభ డిమాండ్ చేసిందన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పోరాడుతుందన్నారు. కాగా సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కమిటీ సభ్యులుగా అరుణ్ కుమార్, సతీస్, సంగ్రామ్, శకుంతల ఎన్నికయ్యారు.

సీఎంపై కేటీఆర్ వ్యాఖ్యలు అవివేకానికి నిదర్శనం



నవతెలంగాణ-పటాన్‌చెరు

'ముడుపులతో ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అనడం ఆయన అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నర్సింహ రెడ్డి అన్నారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరదల వల్ల సుమారు రూ.11 వేల కోట్ల నష్టం జరిగిందని.. బాధితుల సహాయార్థం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తే.. ముడుపులను తీసుకెళ్లే ముఖ్యమంత్రి అని కేటీఆర్ మాట్లాడడం దుర్మార్గమన్నారు. గతంలో 2004లో యూపీఏ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా వందలసార్లు ఢిల్లీకి పయనమయ్యాడని ఢిల్లీకి పోయినప్పుడల్లా తెలంగాణ నుండి ముడుపులు తీసుకెళ్లాడా లేదంటే ఢిల్లీలో ముడుపులు తిన్నాడా అంటూ తీవ్రంగా విమర్శించారు.గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు అనేకమార్లు కేంద్ర మంత్రులను కలవడానికి ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకోవడానికి ఢిల్లీకి.. అది కూడా ప్రత్యేక విమానాల్లో వెళ్లారన్నారు. విభజన హామీలోని ఏ ఒక్క ప్రాజెక్టును తెలంగాణకు తీసుకురాలేకపోయిన బీఆర్ఎస్ మాజీమంత్రి కేటీఆర్ ఇప్పుడు కేంద్రం నుండి ఏం నిధులు తీసుకొస్తావు అని కాంగ్రెస్ పార్టీని అడగడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అలాంటి మాటలు మాట్లాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య, పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్ మోరే, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు




నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

దేవీ నవరాత్రి ఉత్సవాలు బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బొల్లారం మున్సిపాల్టీలోని పోచమ్మ బస్తీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దిననాథ్, రాజారామ్, చంద్రశేఖర్, జె.జె సింగ్, నవీన్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



మనూర్ : నాగలిగిద్ద, మనూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి.. మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా బోరంచ నల్ల పోచమ్మ ఆలయం లో నెలకొల్పిన దుర్గామాత దర్శనం కోసం దూర ప్రాంతం నుంచి జనం వస్తున్నారు.

రాయికోడ్ : మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఉమాదేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం శ్రీ మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలు ఆలపించి ప్రత్యేక పూజలు చేశారు.

రామచంద్రాపురం : రామచంద్రాపురం పట్టణంలోని మల్లికార్జున్ నగర్ దుర్గాభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అష్టాదశ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు లక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి సమక్షంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు కార్తీక్, వంశీ, రాఘవేంద్ర, ఈశ్వర్, సాత్విక్, అజయ్, సంజయ్, రవి యూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్ : మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కుల మతాలకతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ స్టేట్ అసోసియేట్ అధ్యక్షులుగా పవన్‌రాజ్

నవతెలంగాణ-జిన్నారం



పీఆర్టీయూ స్టేట్ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులుగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు గౌర్రాజు పవన్ రాజ్ నియామకమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశంలో ఈ నియామక ప్రక్రియ జరిగింది. ఆయన తోపాటు కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మొగులయ్య రాష్ట్ర కార్యవర్గంలో అసోసియేట్ అధ్యక్షులుగా నియామ కమయ్యారు. అలాగే జిన్నారం మండలానికి చెందిన బొల్లారం హై స్కూల్ కె త్రిశూల్నాథ్, వావిలాల జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన వై బ్రహ్మఋషి, జిల్లా పరిషత్ హై స్కూల్ మాదారానికి చెందిన కే సత్యనారాయణలు పీఆర్టీయూ స్టేట్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయి పదవులకు ఎంపికైన వారిని జిన్నారం మండల పిఆర్టియు శాఖ అధ్యక్షులు హెచ్‌వి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్లు అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలలు సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

లయన్ మంగళపర్తి వెంకటేశానికి శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-అమీన్‌పూర్



సంగారెడ్డి మండల విశ్రాంత విద్యాధికారి, జోన్ చైర్మెన్ లయన్ మంగళపర్తి వెంకటేశానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అమీన్‌పూర్ జిఎమ్‌టి చైర్మెన్ లయన్ భాశెట్టి క్రిష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి.. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భముగా క్రిష్ణ మాట్లాడుతూ.. వెంకటేశం ఇలాంటి జన్మదినాలను ఎన్నో జరుపుకోవాలని, లయన్స్ క్లబ్‌కు ఎన్నో సేవల ద్వారా గుర్తింపు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ క్లబ్ అధ్యక్షులు లయన్ బుల్కాపురం కృష్ణాగౌడ్, లయన్ సభ్యులు భాశెట్టి శ్రీనాథ్,ప్రమోద్ రెడ్డి, యాదయ్య, టి. శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

అలాగే రాంచంద్రపురం రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో గుండం మోహన్‌రెడ్డి, జి. బస్వరాజ్, మోహన్‌దాస్, నాగేశ్వర్ రావు తదితరులు వెంకటేశాన్ని సన్మానించారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ అధ్యక్షులు, కార్యదర్శి జార్జ్ మ్యాత్యూ, నాయికోటి రామప్ప, డిస్ట్రిక్ట్ చైర్మెన్‌లు లయన్ పి.రాములుగౌడ్, యస్. విజయందర్‌రెడ్డి వెంకటేశానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
3
మెదక్
బుధవారం | 09 అక్టోబర్ 2024 | www.navatelangana.com

యువకులు క్రీడల్లో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

- బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షులు సంతోష్ రావు



నవతెలంగాణ-కొల్చారం

యువకులు క్రీడలో పోటీ తత్వాన్ని అలవ ర్చుకోవాలని కొల్చారం మండల బీఆర్ఎస్ యువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు అన్నారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలోని ప్రాథ మిక పాఠశాల ఆవరణలో కబడ్డీ టోర్నమెంట్‌ను మంగళవారం టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించే కబడ్డీ టోర్నమెంట్ పోటీలో ఆరు టీంలు పాల్గొంటున్నాయని, ప్రతి సంవత్సరం యువకుల చైతన్యం కోసం కబడ్డీ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. అలాగే క్రీడలతో యువకులలో పోటీతత్వం పెరగడంతోపాటు రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగంపేట సహకార సంఘం వైస్ చైర్మెన్ మోత్కు మల్లేశం, మాజీ సర్పంచ్‌లు కన్నారం రమేష్, వెంకటేశం, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు

- గుంతలను పూడ్చివేసిన పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్ : ఉమ్మడి దుబ్బాక మండలం లోని పలు గ్రామాల్లో బతుకమ్మ సంబురాల ఏర్పాట్లు పంచాయతీ కార్యదర్శులు పూర్తి చేస్తున్నారు. మంగళవారం పోతారెడ్డి పేట, చిట్టాపూర్, పద్మనాభునిపల్లి లతో పాటు పలు గ్రామాల్లో చెరువు వద్ద బతుకమ్మ సంబురాల మరమ్మత్తు పనులు చేపట్టారు.



సామాజిక సేవలతోనే సంతృప్తి



నవతెలంగాణ-కొల్చారం

సామాజిక సేవలతో నే సంతృప్తిని ఇస్తుందని గౌడ సంఘం మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని వెంకట్ గౌడ్ (గజిని) అన్నారు. మంగళవారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో తమ స్వంత నిధులతో విధి దీపాలను గ్రామాస్తులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెదక్, నర్సాపూర్ జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి గుండా వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఇందుకు స్పందించిన వెంటనే తమ స్వంత డబ్బులు రూ.30వేల వెచ్చించి వీధి దీపాలు తీసుకువచ్చి గ్రామస్తులకు అందజేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతంశెట్టిపల్లి మాజీ సర్పంచ్ గడ్డమిది నాగరాణి నర్సింలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డమిది రాములు, ఆత్మకమిటి మాజీ డైరెక్టర్ పుల్లబోయిన పోచయ్య, కొమ్ముల రాజా గౌడ్, పుల్లబోయిన దుర్గేష్, బ్రాహ్మండ్ల పల్లి సత్యనారాయణ, యాదగిరి గౌడ్, మహేష్, వడ్ల భానుచందర్, గడ్డమిది శ్రీను, మంగలి విజయ్, నాయికోటి ప్రవీణ్, గ్రామాస్తులు పాల్గొన్నారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ -వెల్దుర్తి

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవాల్లో దుర్గాభవాని లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో చండీ హెూమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డితో కలిసి హాజరై అమ్మవారిని దర్శించుకొని చండీ హెూమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు చండీ హెూమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు దుర్గామాత భక్తి స్తోత్రాన్ని వినిపించారు. భక్తులందరూ భక్తి నిష్టతతో ప్రేమానురాగాలతో సమాజంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి, తలారి మల్లేష్, హనుమేష్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో వైభవోపేతంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- శ్రీ దుర్గా దేవి గా వన దుర్గామాత దర్శనం
- దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దంపతులు



నవతెలంగాణ -పాపన్నపేట

తెలంగాణలోని అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వన దుర్గాభవాని మాత సన్నిధిలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ వన దుర్గాభవాని మాత శ్రీ దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గోకుల్ షెడ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ మండపం నుంచి భక్తులు బోనాలు తీసుకుని రాజగోపురం వద్దకు డప్పు చప్పుళ్ల మధ్య తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకుని బోనాలు తీసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఆలయ ఈవో చంద్రశేఖర్, పాపన్నపేట సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్మరి జగన్, ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్, మాజీ ఎంపీపీ పుల్లన్నగారి చందన-ప్రశాంత్ రెడ్డి, గంగారెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మండల పరిధిలోని వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి
ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి

రాష్ట్రంలో ఎల్లప్పుడూ వర్షాలు బాగా పడుతూ పంటలు బాగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి వెల్లడించారు. దుర్గామాత కరుణ కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు

బూత్ స్థాయిలో సభ్యత్వాలు పెంచాలి

- మెదక్ ఎంపీ



నవతెలంగాణ-జగదేవపూర్

తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదేనని ప్రపంచ అగ్రరాజాలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయని ఉమ్మడి మెదక్ ఎంపీ రఘు నందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం జగదేవపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బుద్ధ జ్యోతి మహేందర్ చాట్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దేశాయిరెడ్డి ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒకటేనని బీఆర్ఎస్ పదేళ్లలో ఒకే కుటుంబం దోచుకుంటే కాంగ్రెస్‌లో పదిమంది దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామ బూత్ కమిటీల్లో సభ్యత్వాలు ముమ్మరంగా చేయించి రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో జడ్పీటీసీ ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పగడ్బందిగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హవేలిఘనపూర్

వానాకాలం 2024శాతం-25శాతం సీజన్ వరి ధాన్యం సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు తావులేకుండా పగడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం (సన్న రకం, దొడ్డు రకం) కొనుగోలుపై ఏఈఓలు, డీపీఎంలు, ఏపీఎంలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఫ్యాక్స్, ఐకెపి, మార్కెటింగ్, శాఖల ద్వారా 463 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఐకెపి ద్వారా 160, ఫ్యాక్స్ ద్వారా 284, డిఎం సివిల్ సప్లై 07, ఎఫ్ పి ఓ 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు 93 ఏర్పాటు చేయగా, దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలు 370 ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా సన్నరకం ధాన్యంపై రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బోనస్ 48 గంటల్లో రైతుల అకౌంట్‌లలోకి జమ అవుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకానికి వేర్వేరుగా రికార్డులను సరైన విధంగా నిర్వహించాలని, మూమెంట్ ప్లాన్ రిజిస్టర్‌లను సన్న, దొడ్డు రకానికి వేరుగా నిర్వహించాలన్నారు.

కొనుగోళ్లపై ప్రత్యేక దష్టి సారించాలని, సన్నాలకు రూ. 500 బోనస్ పట్ల అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, డయల్ గ్రెయిన్ క్యాలిబర్‌లు, చెక్ పోస్టులు, టోకెన్‌ల జారీ, వేయింగ్ మెషీన్‌లు, ప్యాడీ క్లీనర్‌లు, తదితరాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం హరికష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్ రెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, డిసిఒ కరుణ, మార్కెటింగ్, రవాణా, సంబంధిత అధికారులు తదితరులు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రిజిస్టర్‌ల్లో రైతు పేరు, ఫోన్ నంబర్, సమయం, స్థలం, రైతు సంతకం తీసుకోవాలి.
- ప్రతి కేంద్రం దొడ్డు, సన్న రకానికి వేర్వేరుగా 1, 2, 3, 4. అని కోడ్‌లను కేటాయించాలి.
- ప్రతి కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి ధాన్యం బస్తాపై కోడ్‌లు విధిగా ఉండే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి
- దొడ్డు రకానికి పచ్చ దారం, సన్న రకానికి ఎర్ర దారం ఉండాలి. ఏఈఓలు ప్రతి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించాలి.
- రెండు రకాల ధాన్యం తరలించేందుకు వేర్వేరుగా రవాణా సౌకర్యం కల్పించాలి
- ధాన్యం తేమ శాతం 17గా ఉండాలి, వానల పట్ల అప్రమత్తంగా ఉంటూ రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలి.
- సన్న బియ్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి, ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలి.
- జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలి.

సీతాఫలాల విక్రయంతో కూలీలకు ఉపాధి

- గంప సీతాఫలాలకు రూ.250 నుంచి రూ.400లు

నవతెలంగాణ-నిజాంపేట

సీతాఫలంతో కొంతమంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. రైతులకు కూలీలకు ఇప్పుడు ఎలాంటి పనులు దొరకక సీతాఫలం కాయలను అమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ కమాన్ వద్ద సీతాఫలం కాయలను కొనుగోలు, అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. వరినాట్లు వేసిన తర్వాత కూలీలకు రైతులు ఎలాంటి పనులు దొరకకపోవడంతో సీతాఫలాలను అమ్ముకుంటున్నారు. ఉదయం 6 గంటలకు ఇంటిలో నుంచి పోయి సీతాఫలాలను చెట్ల నుంచి తెంపి ఉదయం 11 గంటలకు అమ్ముతారు. దాదాపు 20 గ్రామాల నుంచి కూలీలు వస్తారు. దళారులు ఏ ధర చెపితే అదేధరకు కొనుగోలుదారులు కొంటున్నారు. ఒక్క గంపకు రూ.250 నుంచి రూ.400 వరకు ధర పలుకుతుంది. ఒక మనిషి రోజుకు ఒకటి నుంచి రెండు గంపల వరకు అమ్ముతుంటారు. కొనుగోలుదారులు ఇక్కడి నుంచి నిజామాబాద్, హైదరాబాదు లాంటి నగరాలకు తీసుకువెళ్తారు, రోజుకు ఒక డీసీఎం చొప్పున తరలిస్తున్నారు. మంచిగా గిట్టుబాటు ధర ఉండేదని ప్రస్తుతం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. పోయిన సంవత్సరం రూ.500 నుంచి రూ.700కు ధర ఉండేదని ఈ సంవత్సరం చాలా తక్కువకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.



సీతాఫలాల విక్రయమంతో ఉపాధి పొందుతున్నాం



సీతాఫలం కాయలతో ఉపాధి పొందుతున్నాము. ఉదయం ఏడు గంటలకు చెట్ల వద్దకు వెళ్లి ఫలాలు తెచ్చి ఉదయం 11 గంటలకు కొనుగోలుదారులకు విక్రయిస్తాం. ఒక గంప సీతాఫలాలకు రూ.250 నుంచి రూ.400 వరకు ధర పలుకుతుంది. వారు ఎంత చెప్తే అంతకే అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. సీతాఫలాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గత సంవత్సరం సీతాఫలాల (చిప్పలకాయ) ధరలు బాగుండేదని గిట్టుబాటు ధర కూడా ఉండేది. ఈ సంవత్సరము తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. పోయిన సంవత్సరం రూ.500 నుంచి రూ.700 వరకు గిట్టుబాటు ధర ఉండేది. గిట్టుబాటు ధర ఉంటే బాగుండేదని ఈ సంవత్సరం కూడా గిట్టు బాటు ధర కల్పిస్తే బాగుంటుంది.

పోచయ్య, బాగిర్తిపల్లి, కామారెడ్డి జిల్లా

బతుకమ్మ పండుగ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక

- నేడే జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ వేడుకలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, ఈ సంబరాలను కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ సందర్భంగా మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్‌డీఓ రమాదేవి, జెడ్పీసీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, మెప్మా పిడి ఇందిరా, సంబంధిత ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ సమీక్షించి సమర్థ వంతంగా నిర్వహించేందుకుగాను సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మయ పండుగను నిర్వహిస్తాం న్నారు. ఇందుకుగాను అవసరమయ్యే ఏర్పాట్లు, సౌకర్యాలను కల్పించాలన్నారు. అన్ని ప్రాంతాల వద్ద లైటింగ్, మంచినీటి సౌకర్యం, సౌండ్ సిస్టం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని, ప్రతి మండలంలో బతుకమ్మ సంబరాలను విజయవంతంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాల న్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. డీఆర్డీఓ మెప్మా ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణ ఆవరణలో సాంప్రదాయ వంటకాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో మెదక్ స్టేడియం నుంచి రాందాస్ చౌరస్తా వరకు 2 కేర్ నిర్వ హణకు మహిళలు బతుకమ్మ ఆడిన తరువాత చెరువుల్లో నిమజ్జనం చేస్తారని నిమజ్జన ఘాట్ల వద్ద విద్యుత్ ఏర్పాట్లు, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు నీళ్లలోకి దిగకుండా భద్రతాపై పటిష్ఠ చర్యలు తీసుకోవాల న్నారు. ట్రాఫిక్ నియంత్రణ, మహిళ, పురుషుల పోలీసులతో పటిష్ఠ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరా కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య అంబులెన్స్‌లు, ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ సంప్రదాయం, సాంస్కృతి ప్రతిబింబించే విధంగా సాంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. భారీ వాహనాలు ప్రధాన రహదారిపై రాకుండా మళ్లించేందుకు పోలీస్ యంత్రాంగం తరపున పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు.

సామాన్య ప్రజలను చైతన్యవంతులను చేయాలి

- గ్రామాలలో కళా జాతర ప్రదర్శనలు
- జిల్లా ఎస్‌పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మెదక్ జిల్లాలో మూఢనమ్మకాలను ఎదిరించి సామాన్య ప్రజలను చైతన్యవంతం చేయాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన కొన్ని మూఢ నమ్మకాల సంఘటనలను దృష్టిలో పెట్టుకుని మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర జన విజ్ఞాన వేదిక అధ్యక్షులైన చలమల రాజేశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో మెదక్ జిల్లాలో మూఢ నమ్మకాలపై నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో ఎస్‌పీ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ద్వారా సమాజంలో శాస్త్ర దృక్పధంతో సంబంధం లేకుండా జరుగుతున్న మూఢ నమ్మకాలను సామాన్య ప్రజానీకంలో శాస్త్ర విజ్ఞాన ప్రచారం, శాస్త్రీయ ఆలోచనా దృక్పథం పెంపొందించ డానికి కృషి చేయాలన్నారు. మూఢ నమ్మకాలు, ఛాందస భావాలను అరికట్టేం దుకు విస్తృత ప్రచారం చేసి అవాగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారాన్ని చేయాల న్నారు. మూఢ నమ్మకాలను అప నమ్మకాలను తొలగించి దైనందిన జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాస్త్ర పరిజ్ఞా నంపై అవగాహన కల్పించడం వల్ల ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను పారద్రోల డానికి అవాకాశం ఉంటుందన్నారు. దూరాచారాలను పారద్రోలడానికి కళా జాత బృందాలు, కులసంఘాలు, గ్రామ పెద్ద మనుసులు కూడా పోలీస్ వారితో సమ న్వయంగా అవహగహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి యస్.వెంకట రమణ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వర ప్రసాద్, మహేందర్, జిల్లా నాయకుల యల్. దేవ్లా, జేవీవీ రాష్ట మహిళా నాయకురాలు చలమల పద్మ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల ఎన్నిక





నవతెలంగాణ-వెల్దుర్తి

హైదరాబాదులో జరిగిన 35వ పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాసాయి పేట మండలం నుంచి భాగన్నగారి బాగారెడ్డి, కాసుల హరిరంజన శర్మలు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి పీఆర్‌టీయూ మాసాయి పేట మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా కార్య దర్శి దయాకర్, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీశైలం, బాలమనిలు అభినం దనలు తెలిపారు.

ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన మంత్రుల పర్యటన

- ప్రధాన సమస్యలు ప్రస్తావన లేదు
- మంత్రుల దృష్టికి తీసుకపోని స్థానిక నేతలు





నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలలకు రాష్ట్ర ముఖ్యమైన ముగ్గురు మంత్రులు ఇటీవల గజ్వేల్ పర్యటన వచ్చారు. గజ్వేల్ పట్టణంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ స్థానిక నేతలు సైతం మంత్రుల దృష్టికి తీసుకుపోయినట్లు కనిపించలేదు. మంత్రుల పర్యటనపై గజ్వేల్ ప్రజలకు మరిన్ని హామీలు పెండింగ్లో ఉన్న పనులపై ప్రకటనలు చేస్తారని ఎంతో ఎదురుచూశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పెండింగు పనుల విషయాలు ఎక్కడ కూడా మంత్రులు ప్రస్తావించలేకపోయారు. రాష్ట్ర క్యాబినెట్లో కీలక మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ ఇటీవల గజ్వేల్ లో పర్యటించారు. మూడు శాఖలకు సంబంధించిన అనేక సమస్యలతో గజ్వేల్ నియోజకవర్గం కొట్టుమిటాడుతున్నాయి.ఏ ఒక్క సమస్య కూడా స్థానిక నేతలు మంత్రులు దృష్టికి సభా పరంగా మాత్రం తీసుకపోలేదని చెప్పాలి.

వ్యవసాయ శాఖ మంత్రి...

గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వంలో నిర్మించిన భూసార కేంద్రంలో అధికార సిబ్బంది లేక అనేక ఏండ్లుగా కేవలం తలుపులు తెరిచి ఉంటుంది. కొన్ని నెలలు తాళాలు వేసి ఉన్న భూసార పరీక్ష కేంద్రం ఇటీవల క్షేత్రస్థాయి సిబ్బందిని పెట్టి తెరిచి ఉంచుతున్నారు. కేవలం భవనానికి మాత్రమే పరిమితమైంది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర దృష్టికి తీసుకుపోతే భూసార పరీక్షకు సంబంధించిన అధికార సిబ్బందిని కేటాయించే అవకాశం ఉండేది. సిబ్బంది కొరత. ఇటీవల రైతు రుణమాఫీ సర్వే అధికారులకు తలకు మించిన భారంగా మారింది.

రవాణా శాఖ మంత్రి...

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో బస్టాండ్ నిర్మాణం. ఆగుతూ సాగుతూ పనులు సాగుతున్న ముందుకు వెళ్లడం లేదు. గత పది నెలలుగా పనులు నిలిచిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెప్తున్నారు. రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్యలు పరిష్కరిస్తే బాగుండేదని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా బస్టాండ్ పూర్తి కాకపోవడంతో బస్సులు రోడ్లపై ఉండటంతో ప్రయాణికులు కూడా రోడ్లపైనే నిల్చుని ఇబ్బందులు గురవుతున్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వేజ్ మార్కెట్ గేటు ముందు స్థలం ఇవ్వాలని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకుపోతే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చేది. కొన్ని గ్రామాలకి ఆర్టీసీ బస్సులు పరిమితమయ్యాయి. గ్రామాల నుంచి పట్టణాలకు రావాలంటే చాలా గ్రామాలకు బస్సులు లేవు. ఇటీవల బస్సులు రావడం లేదని చాలా గ్రామాల్లో ధర్నాలు విద్యార్థులు చేసిన విషయం తెలిసిందే. గజ్వేల్ రింగ్ రోడ్డు చివరి దశలో ఉంది. నిధులు లేక నిలిచిపోయిన విషయాన్ని మంత్రులు ద ృష్టికి తీసుకుపోతే బాగుండేదని స్థానికులు చెబుతున్నారు. రింగ్ రోడ్డు పూర్తి కాకపోవడంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మధ్యన ట్రాఫిక్ అంతరాయాలు నిత్యం కనిపిస్తున్నాయి. స్థానిక ఇందిరాపార్క్ నుంచి కోట మైసమ్మ రోడ్డు పెండింగ్లో పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని కూడా స్థానిక నేతలు మంత్రులు దృష్టికి తీసుకుపోలేదు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

• మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ మంగళవారం 100వ రోజుకు చేరు కుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలు అభినంద నీయమని ప్రతిరోజు ప్రభుత్వ ఆసు పత్రుల్లో రోగులకు, వారి బంధు వులకు ఉచిత అల్పాహారం అందజే శామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు లయన్స్ క్లబ్ సేవకు ప్రతిరూపమని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ను అభినందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, గోలి సంతోష్, నేతి శ్రీనివాస్, గుడాల రాధాకృష్ణ, సంజయ్ గుప్తా, మల్లేశం గౌడ్, పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా వేమారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్




పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఊడెం వేమారెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం మేడ్చల్ జిల్లా షామీర్‌పేటలో నిర్వహించిన పీఆర్టీయూ ఎన్నికల్లో వేమారెడ్డిని ఎన్నుకున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన వేమారెడ్డి సంఘంలో అనేక పదవులను పొంది రాష్ట్రస్థా యికి ఎదిగారు. గత 28 ఏళ్లుగా పీఆర్టీయూ సంఘానికి సేవలందిస్తూ బలోపేతానికి కృషి చేస్తున్నారు. గతంలో రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షులు, జిల్లా కౌన్సిలర్, గజ్వేల్ మండల అధ్యక్ష పదవులను ఆయన నిర్వహించారు. ఎమ్మెల్సీ కూర రఘుత్తమారెడ్డి, రాష్ట్ర కమిటీకి వేమారెడ్డి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ..రానున్న కాలంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తామని ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం సాగిస్తామని అన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని సౌకర్యాలను సాధించేందుకు తన వంతు పోరాటాన్ని చేస్తామన్నారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డికి పరామర్శ

• పురుషోత్తంరెడ్డి లేని లోటు తీరనిది
• నివాళ్లర్పించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి


నవతెలంగాణ-దుబ్బాక రూరల్



ఇటీవల రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పితృ వియోగానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్య క్షుడు డా.శ్రవణ్ కుమార్ రెడ్డి హైద్రాబాద్లో ఉత్తమ్ కుమార్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తన తండ్రి అనారోగ్యంతో మృతి చెందడం ఉత్తమ్‌కి తీరని లోటన్నారు. అంతకముందు పురుషోత్తంరెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్, ఉమ్మడి దుబ్బాక మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

33వ వార్డులో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-సిద్దిపేట



33వ వార్డులో నెలకొన్న సమస్య లను కౌన్సిలర్ తస్లీమ్ బేగమ్-అబ్దుల్ మొయిజ్‌లు మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం ఆయన వార్డులో పర్యటించారు. దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా బారా ఇమామ్ చౌరస్తా వద్ద ఉన్న హై మాస్ట్ లైట్ పోల్ రిపేర్, పాత పోస్ట్ ఆఫీస్ వద్ద నిరుపయోగంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్ ఉపయోగంలోకి తేవడం, డ్రైన్స్ క్లీనింగ్, శానిటేషన్ సమస్యలను ఆయన పరిశీలించారు. సంబం ధిత అధికారులకు త్వరతగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలను కమిష నర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 34 వార్డ్ కౌన్సిలర్ గుడాల సంధ్య-శ్రీకాం త్, ఏఈఈ అన్వేష్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, జవాన్‌లు భాను, మల్లేశం, ఎలక్ట్రిక్ సూపర్‌వైజర్ ముజహిద్ పాల్గొన్నారు

పీహెచ్‌సీలో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-బెజ్జంకి




మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణం ముందు సిబ్బంది బతుకమ్మ పండుగ సంబురాలు మంగళవారం చే సుకున్నారు. వైద్యురాలు నసీమా ఉన్నీ సా బేగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

-వేతనాలు పెంచాలని..

తమ వేతనాలు పెంచాలని ఆశాకార్యకర్తలు పీహెచ్‌సీ ఆవరణం ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. బాగ్యలక్ష్మి, సౌమ్య, రేణుక, రజిత, వెంకటలక్ష్మి, రజిని, తదితరులు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-నంగునూరు



10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రాజ గోపాల్ పేట ఎస్ఐ ఎం.డి. అసీఫ్ తెలిపారు. నంగునూరు మండలం ఖాతా గ్రా మంలో పెట్రోలింగ్ చేస్తుం డగా రాజపేట మం డలా నికి చెందిన రెండు మహీంద్రా ట్రాలీ ఆటోల్లో ఇద్దరు వ్యక్తులు భూక్యా శ్రీను, మాడోతూ శ్రీను అక్రమంగా రేషన్ కార్డు హోల్డర్ దగ్గర తెలం గాణ ప్రభుత్వం చే సరఫరా చేయబడిన రేషన్ బియ్యం సేకరించారు. ఫౌల్ట్రీ ఫా రంలకు అధిక ధరలకు అమ్మడానికి రవాణా చేస్తుండగా దాదాపు 10 క్వింటాళ్ల బియ్యం పట్టుకొని రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. సివిల్ సప్లై డీటీ లావణ్య ఫిర్యాదు మేరకు ఇద్దరి పైన కేసు నమోదు చేశామని తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల ఎంపిక



నవతెలంగాణ-మర్కుక్

పీఆర్టీయూ రాష్ట్ర 34 కౌన్సిల్ సమావేశాల్లో మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ను పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కొత్త నరేందర్ రెడ్డి, జి.కూచిరెడ్డి, కే నర్సింలు, నారెడ్డి రామకృష్ణారెడ్డి, ఎండి షాబుద్దీన్, రజిత రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏ. సరితా దేవి, యాదిరెడ్డి, యు. గణేష్, కే.శ్రీధర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సహకరించిన జిల్లా అధ్యక్షులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి , ప్రధాన కార్యదర్శి ఆదరాసపల్లి శశిధర శర్మకు ధన్యవాదాలు తెలియజేశారు. పీఆర్టీయూ మర్కుక్ అధ్యక్షులు రేబల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్, జిల్లా కార్యదర్శి బాలకిషన్ సీనియర్ నాయకులు రమణారావు, వెంకటేశ్వర్ రెడ్డి, కేశవరెడ్డి మండల అసోసియేట్అధ్యక్షులు శ్రీనివాస్, రవీందర్ ,తదితరులున్నారు.

పేదలు పొందే లబ్దిలో రాజకీయాలు వద్దు

• బీఆర్ఎస్ నాయకులు మద్ది నరేందర్

నవతెలంగాణ-గజ్వేల్



రాజకీయ పార్టీలకు అతీతంగా పేదలు లబ్ది పొందే విషయంలో రాజకీయాలు అవసరం లేదని బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ నాయకులు మద్ది నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని, గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో సఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ చెక్కులు అందించడంలో రాజకీయాలను ముడిపెడుతుందని అన్నారు. పేదలకు అందవలసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రాజెక్టుల్లో భూములు ఇండ్లు కోల్పోయిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లిస్తే బాగుంటుందన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కొమ్మూరి




నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని నాగపురి గ్రామంలో విశ్రాంత పట్వారీ గొట్టం నర్సింహారెడ్డి సతీమణి సుగుణ(70) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తూ సోమవారం రాత్రి మృతి చెందగా కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మంగళవారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజ మల్లేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పుర్మ ఆగం రెడ్డి నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మెన్ గూడెపు మహేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బాబు, శ్రీనివాస్, నర్సింహులు, సుధాకర్, రాగి యాదగిరి, పాల్గొన్నారు.

బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో

• బంగారు బతుకమ్మ ఉయ్యాలో
• ఆడపిల్లలను బతకనిద్దాం రక్షించుకుదాం
• సద్దుల బతుకమ్మతో సమాప్తం
• పల్లెలకు బతుకమ్మ కళ
• చెరువులను ముస్తాబు చేస్తున్న అధికారులు









నవతెలంగాణ-మిరుదొడ్డి

రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు అనే పాటలను పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... అని ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం ఉంటాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చిన గత వెయ్యి ఏళ్లగా బతుకమ్మను ఇక్కడి ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా చేసుకుంటున్నారు. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. బతుకమ్మ పండుగను 9 రోజులు వివిధ పేర్లతో పిలుస్తారు.

1.ఎంగిలి పూల బతుకమ్మ: మహాలయ అమావాస్య రోజు బతుకమ్మ మొదటి రోజు వేడుక మొదలవుతుంది.

2.అటుకుల బతుకమ్మ: ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం అమ్మవారికి పెట్టాలి.

3. ముద్దపప్పు బతుకమ్మ : ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పించాలి.

4. నానే బియ్యం బతుకమ్మ : నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యంగా నివేదించాలి.

5. అట్ల బతుకమ్మ : అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పించాలి.

6. అలిగిన బతుకమ్మ : ఈరోజు ఆశ్వయుజ పంచమి. ఈనాడు నైవేద్యం సమర్పించరు.

7. వేపకాయల బతుకమ్మ : బియ్యం పిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారుచేసి నైవేద్యంగా సమర్పించాలి.

8. వెన్నముద్దల బతుకమ్మ : నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పించాలి.

9. సద్దుల బతుకమ్మ : ఆశ్వయుజ అష్టమి రోజు దుర్గాష్టమి చేసుకుంటారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, లెమన్ రైస్ సమర్పించాలి.

తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పూజించిన మహిళలు చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు అప్పుడే పండుగ అయిపోయిందన్న బాధతో చెరువులో నిమజ్జనం చేస్తారు. ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని గంగమ్మ ఒడికి చేరుస్తారు. అంతటితో బతుకమ్మ పండుగ ముగుస్తుంది.

బతుకమ్మ అంటే సంబరమే సంబరం..

బతుకమ్మ పండుగకు ఒక వారం ముందు నుంచే ఇళ్ళలో హడావిడి మొదలవుతుంది. బతుకమ్మ పండుగ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ఆడపడుచులు పండగకు వారం రోజుల ముందే పుట్టింటికి చేరుకుని ఆనందోత్సాహాలతో పండుగ సన్నాహాలు చేసుకుంటారు. ప్రధాన పండుగకు వారం రోజుల ముందు నుంచే తెలంగాణ ఆడపడుచులు చిన్న చిన్న బతుకమ్మలు తయారు చేసి ప్రతిరోజూ సాయంత్రం ఆ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. ఆ తర్వాత చెరువులో బతుకమ్మని నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ పండుగ చివరిరోజు జరిగే వేడుకలను, ఆ వైభవాన్ని చూడటానికి రెండు కండ్లు చాలవు. నయన మనోహరకరంగా వుంటుంది ఆ సన్నివేశం. ఆ రోజున పురుషులంతా పచ్చిక బయళ్ళలోకి పోయి తంగేడు, గునుగ, కలువ పూలను కోసుకుని వస్తారు. ఆ తర్వాత ఇంట్లో అందరూ గునుగ, తంగేడు, కలువ పువ్వుల్ని, మరికొన్ని పువ్వుల్ని కలిపి బతుకమ్మను తయారు చేస్తారు. బతుకమ్మలో మిగతా ఎన్ని పూలు వున్నా గునుగ పూలు, తంగేడు పూలదే ఆధిపత్యం ఉంటుంది. బతుకమ్మ వేడుకల చివరి రోజు సాయంత్రం ఆడపడుచులు అందరూ చక్కగా దుస్తులు, అభరణాలు ధరించి బతుకమ్మను వాకిలిలో పెడతారు. చుట్టుపక్కల ఉన్న వారు కూడా వారి బతుకమ్మలను ఇదే విధంగా అమర్చి వాటి చుట్టూ పెద్ద వలయాకారంలో చేరుతారు. ఐక్యత, ప్రేమతో మానవ హారంలా బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. ఒకరు ముందుగా పాట మొదలుపెడితే మిగిలినవారు వారితో గొంతు కలుపుతూ పాడుతారు. ఈ జానపద గీతాలు ప్రత్యేకమైన తెలంగాణా సంస్కృతిని ఆవిష్కరిస్తాయి. చీకటి పడే వేళకి ఆడపడుచులందరూ బతుకమ్మలను తలపై పెట్టుకుని పెద్ద చెరువు గానీ, తటాకంవైపు గానీ ఊరేగింపుగా వెళ్తారు. ఈ ఊరేగింపు అందంగా అలంకరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో, వాయిద్యాలతో కన్నుల పండుగగా వుంటుంది. జలాశయం చేరుకున్న మహిళలు బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడుతూ నీటిలో జారవిడుస్తారు. ఆ తరువాత చక్కెర, రొట్టెతో చేసిన 'మలీద' అనే వంటకాన్ని బంధువులకు పంచిపెట్టి తింటారు. ఆ తర్వాత ఖాళీ పళ్లెం (తాంబళం)తో ఇంటికి చేరతారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

• బాధితులకు ఫోన్ల అప్పగించిన అడిషనల్ సీఐ ముత్యంరాజు

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో స్వాధీనం చేసుకుని తిరిగి బాధితులకు అప్పగించినట్లు గజ్వేల్ అడిషనల్ సీఐ ముత్యంరాజు తెలిపా రు. మంగళవారం భాదితునికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. దీపక్ చంద్ర వంశీ జార్ఖండ్ రాష్ట్రం గత కొన్ని రోజుల క్రితం డ్రైవింగ్ చేస్తూ, గజ్వేల్ పట్టణంలో వెళుతుండగా ఫోను ఎక్కడో పడిపోయిందని పేర్కొన్నారు. ఫోన్ పోయిం దని పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ అనే వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేయడం జరిగిందన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫోన్లు దొరికిన వెంటనే బాధితురాలకి ఫోన్ అందజేశామన్నా రు. ఎవరైతే ఫోన్ పోగొట్టుకుంటే, గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొని పోయిన సమాచారం అందించాలన్నారు. వా రు వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనం గా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెం ట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకు న్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చు న్నారు. అనంతరం కోల్పోయిన ఫోన్ తిరిగి పొందే అవకాశం ఎక్కు వ గా ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని, ఎవరన్నా సెకండ్ హ్యాండ్ ఫోన్స్ అమ్మితే కొనవద్దని సూచించారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

• చిరు ధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలి
• అర్బన్ మండల ఏవో శ్రీనాథ్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

అంతర పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని అర్బన్ మండల ఏవో శ్రీనాథ్ అన్నారు. అర్బన్ మండలం మిట్టపల్లిలో మామిండ్ల యాదగిరి తన పొలంలో కంది పంటలో అంతర పంటగా సాగు చేసిన రాగి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతు లు పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వా లని కోరారు. అంతర పంటలను సాగు చేయడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో ఒక పంట నష్ట పోయినా మరో పంట దిగుబడితో నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. వరి పొలాలను పరిశీలించి తెగులు నివారణకు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఏవోతో పాటు పవన్, శ్రీకాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

సామాజిక రుగ్మతులపై అవగాహన కలిగి ఉండాలి

• బాలల హక్కుల పరిరక్షణ అధికారి రాజు

నవతెలంగాణ-రాయపోల్



గ్రామాల్లో ప్రజలు యువకులు సామాజిక రుగ్మతులపై అవగాహన కలిగి ఉండాలని, బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గజ్వేల్ డివిజన్ బాలల హక్కుల పరిరక్షణ అధికారి రాజు అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో బాలల హక్కులు, విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగం సామాజిక రుగ్మతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో బాలలపై, మహిళలపై అనేక అరాచకాలు లైంగిక దాడులు జరుగుతున్నాయని వాటి నివారణ కోసం ప్రజలందరూ చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా ర్థులు, పిల్లలు మొబైల్ ఫోన్ చూడడం సర్వసాధార ణమైందని వారు మొబైల్ ఫోన్‌లో ఏలాంటి యాప్ లు ఓపెన్ చేస్తున్నారు మొబైల్ దేనికోసం ఉపయోగిస్తున్నారు మొబైల్ వలన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారా అలాంటి అంశాలపై తల్లిదండ్రులు గమనించాలన్నారు. బాలలకు రాజ్యాంగం ప్రకారం వారికి హక్కులు చట్టాలు కల్పించబడ్డవి వాటిని పొందే అధికారం బాలలకు ఉన్నాయ న్నారు. వారి హక్కులకు భంగం కలిగించకుండా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలియజేశారు. బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు ,భాగ స్వామ్యపు హక్కు వీటితోపాటు బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, చట్ట వ్యతిరేకంగా పిల్లల అమ్మకం కొనడం ,బాల్యవివాహాల నిరోధక చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, జీవినియల్ జస్టిస్ యాక్ట్, పిల్లల రక్షణ కోసం వారి సమస్యలపై ఫిర్యాదు చేయడానికి చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098, అలాగే మహిళల సమస్యల పరిరక్షణ కోసం 181,100 వంటి టోల్ ఫ్రీ నెంబరులు ఉన్నాయని వీటి ద్వారా ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చున్నారు. అలాగే బాలలకు స్పర్శ పై అవగాహన కల్పించారు స్పర్శలో 2 రకాలుగా సదుద్దేశంతోటి స్పర్శిం చడం, దురుద్దేశంతో స్పర్శించడం ఉంటుందన్నారు. చట్టం ప్రకారం వరకట్న నిషేధమని వరకట్నం పేరుతోటి మహిళను హింసిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇలాం టి అంశాల పైన బాలలు అందరూ చైతన్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ అధికారి వినోద, గ్రామ యువకులు పరుశురాములు, అనీఫ్, జోగు పర్శ రాములు, బాలకృష్ణ, గౌరీగారి పరుశురాములు, షాదుల్, కరుణాకర్, నరేష్, రవి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యార్థికి డీఎస్సీలో జిల్లా రెండవ ర్యాంకు

నవతెలంగాణ-మిరుదొడ్డి



డీఎస్సీ ఫలితాల్లో మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురి శ్రీకాంత్, సిద్దిపేట జిల్లా 2వ ర్యాంకర్ గా నిలిచారు . గత డీఎస్సీలో 0.2 మార్కులతో ఉద్యోగం కోల్పో గా, ఈ సారి పట్టువిడవకుండా చదివి ఉద్యోగం సాధించాడు. దాం తో విద్యార్థిని గ్రామస్తులు అభినందించి, యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత మార్కులు సాధించడం గర్వకారణం. భవిష్యత్తులో అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్యంగా సాధన చేస్తున్నాని శ్రీకాంత్ తెలిపారు.

సారే రావాలి... సారే పంచాలి

• గజ్వేల్‌కు ముఖం చాటేసిన కేసీఆర్







నవతెలంగాణ-గజ్వేల్

సారే రావాలి.. సారే పంచాలి.. అంటూ గత ఆరు నెలలుగా గజ్వేల్ ప్రజలు మాజీ సీఎం గజ్వేల్ శాసనసభకు ఎన్నికైన కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్నారు. దీన్ని అధికారపక్షం కాంగ్రెస్, స్థానిక బీజేపీ నాయకులు నిరసనలు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేస్తున్నారు. 2014 నుంచి 2023 ఎన్నికల ప్రచారం నాటికి పది ఏండ్లల్లో నియోజకవర్గానికి మూడు నాలుగు సార్లు సభలకు, పాటు ఎన్నికల ప్రచారానికి సమయంలో ఒక గజ్వేల్ కేంద్రానికి వచ్చి పోయారు. ఇంతవరకు బాగానే ఉంది. నియోజకవర్గానికి స్పెషల్ అధికారులను నియమిస్తూ పదేండ్ల పరిపాలన స్థానికంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి నిర్వహించారు. దీనికి తోడు కేసీఆర్ అల్లుడు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పలు కార్యక్రమాలకు హాజరై ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశారు. ఇదిలా ఉండగా 2023 అధికారం కోల్పోయిన నాటికి గజ్వేల్ నియోజకవర్గంలో పేదలకు సంబంధించిన షాది ముబారక్, కళ్యాణ్ లక్ష్మి తో పాటు సీఎం సహాయ నిధి చెక్కులు ఉన్నాయి. సీఎం సహాయనిధి చెక్కులు స్థానిక నేతలు పంపిణీ చేస్తుండగా షాది ముబారక్, కళ్యాణ్ లక్ష్మి చెక్కులపై స్థానిక శాసనసభ్యులు సంతకం పెట్టాలని నిబంధన ఉంది. పది నెలలుగా వస్తున్న చెక్కులు ల్యాప్స్ అవకాశం మెండిగా ఉందని స్థానిక రెవెన్యూ అధికారులు స్వయంగా కేసీఆర్ ఓ ఎస్ డి ముత్యంరెడ్డికి, కేసీఆర్‌కు సమాచారం ఇచ్చారు. మొరపెట్టుకున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలోని మండలాలకు సంబంధించిన 860 పైగా చెక్కులు ఉన్నట్లు సమాచారం. ఇవి పంపిణీ చేయాలంటే ఎమ్మెల్యే లేదా ప్రోటోకాల్ ఉన్న ప్రజాప్రతినిధులు పంపిణీ చేయాలి. ఇటీవల రాష్ట్రానికి చెందిన ముగ్గురు మంత్రులు గజ్వేల్ పట్టణంలో పర్యటించినప్పటికీ ఆ చెక్కుల విషయాన్ని బహిర్గతం చేస్తూ వివాదాస్పద వాక్యాలను చేస్తూ కేసీఆర్ పై జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ మండిపడ్డారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయండి. ఎమ్మెల్యే కనిపించడం లేదని క్యాడర్కు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఉంటూ గజ్వేల్ కేంద్రానికి రాకపోవడం ఏమిటి అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. శాసనసభ, గజ్వేల్ ప్రజలకు రాకపోవడం ఇది భావ్యం కాదన్నారు. నిన్ను నమ్మి మూడుసార్లు గజ్వేల్ ప్రజలు గెలిపించినట్లు మంత్రులు పేర్కొన్నారు. ఇదే తనువుగా గజ్వేల్ కాంగ్రెస్‌లో ఉన్న రెండు గ్రూపుల నాయకులు ఫిర్యాదులపై ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వర్గీయులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెళ్లి కేసీఆర్ చిత్రపటానికి వినతి పత్రం ఇచ్చారు. క్యాంప్ ఆఫీస్ కొచ్చి చెక్కులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓఎస్డీ అందుబాటులో లేకపోవడం వల్ల క్యాంపు కార్యాలయం ముఖద్వారం వద్ద కేసీఆర్ రావాలని వినపత్రాన్ని అంటించారు. గతంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు రాస్తారోకో ధర్నాలు నిర్వహించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ నేతలు గట్టి కౌంటర్లు ఇస్తూ వస్తున్నారు.

గజ్వేల్లో అనేక పనులు పెండింగ్లో..

గజ్వేల్ లో అనేక పనులు పెండింగ్లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో నియోజకవర్గ అభివ ృద్ధికి చివరి దశలో రూ. 170 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసి ప్రొసీడింగు కూడా ఇచ్చిందని స్థానిక నేతలు అంటున్నారు. 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డును చివరి దశలో పనులు ఉన్నాయి. పట్టణంలో రెండు బస్టాండ్లను సుమారు రూ 6.50 కోట్లతో నిర్మాణం చేపట్టగా మార్గమధ్యంలోనే నిలిచిపోయాయి. కోట మైసమ్మ రోడ్డు సైతం ఆరేన్నుగా మూలుగుతుంది. పట్టణంలో 2016లో నిర్మాణం చేపట్టిన 1250 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పటికే పంపినకి నోచుకోలేదు. మున్సిపల్‌లో 20 వార్డులు ఉండగా కొన్ని వార్డులు మాత్రమే అండర్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్లు పూర్తి గాక ఇంకా 50శాతం పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ విషయంపై కాంగ్రెస్ నేతలు ద ృష్టికి తీసుకుపోతే స్థానిక ఎమ్మెల్యే ఉన్నాడుగా ఆయన చూసుకుంటాడు అని ప్రజలకు సమాధానం ఇస్తున్నారు.

ఇద్దరు కలెక్టర్లు... ఇద్దరు ఆర్డీవోలు.

గజ్వేల్ నియోజకవర్గం మెదక్, సిద్దిపేట జిల్లాలో రెండు భాగాలుగా ఉన్నది. గజ్వేల్, వర్గల్, ములుగు, జగదేపూర్, కుక్కునూరు పల్లి, మర్కుక్, కొండపాక మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉండగా మెదక్ జిల్లాలో మనోహరాబాద్, తూప్రాన్ మండలాలు ఉన్నాయి. దీంతో ఇద్దరు కలెక్టర్, ఇద్దరు ఆర్డీవోలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు కేసీఆర్ అందుబాటులో ఉండకపోవడం ప్రజలకు కొంత ఇబ్బందిగా మారింది.

మంత్రి హామీతో ఆయిల్ ఫామ్ పంటపై ఆసక్తి

• సిద్దిపేటలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు మంత్రి భరోసా



నవతెలంగాణ-గజ్వేల్

జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటను సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరాల ప్రకటన మరింత సాగుకు ఊరట వస్తుందని చెప్పాలి. ఇటీవల గజ్వేల్‌లో వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి హాజరై ఆయిల్ ఫామ్ రైతులకు అన్ని విధాల ఆదుకుంటామని ప్రస్తుతం సాగు 11 వేల ఎకరాలు చేస్తున్నారని మరో పదకొండు వేల ఎకరాలు సాగు చేస్తే సిద్దిపేటలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో సాగుపై రైతుల ఆసక్తి పెరిగింది. ఆయిల్ ఫామ్ పండించిన రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించేందుకు జిల్లాలోని నర్మెటలో రూ 300 కోట్లతో ఆయిల్ ఫామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని వచ్చే ఏడాది వినియోగంలోకి తీసుకొస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా అశ్వరావుపేటలోని ఫ్యాక్టరీకి ఇక్కడి ఉత్పత్తులను తరలి వస్తున్నాయని మంత్రి గుర్తు చేశారు. ఇక్కడనే ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రైతులు ఎక్కువ స్థాయిలో పంటను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతుకు ఒక్కొక్క టన్నుకు రూ.13,438 వరకు మంచి ఆదాయం వచ్చినట్లు రైతులు చెపుతున్నారు. రైతులు నాలుగేళ్ల పాటు ఎకరాకు నాలుగు టన్నులు ఆ తర్వాత 8 నుంచి 8 టన్నులు రాను రాను 30 ఏళ్ల వరకు దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని ద్వారా ఆదాయం కూడా పెరుగుతుందని చెప్తున్నారు. ఆయిల్ ఫామ్ సాగు పై రైతులు మక్కువ చూపుతున్నారు. మంచి దిగుబడి వస్తుందని సాగు చేస్తున్న రైతులు తెలుపుతున్నారు.

ఆయిల్ ఫామ్‌ల్లో అంతర్ పంటలు

అంతేకాకుండా ఆయిల్ ఫామ్ పంటల్లో అంతర్ పంటలు సాగుకు పెద్ద ఎత్తున ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. మూడేళ్లకు ఒకసారి రానున్న పంటకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ప్రభుత్వం ప్రకటించడంతో గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవపూర్ మండలం ఎల్లాయి గూడ రైతులు ముందుకు వచ్చారు. మొక్కలను రైతులకు సబ్సిడీపై ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఒక మొక్క రూ.20లకే అందిస్తుంది. ఎకరాకు సుమారు 57 మొక్కలు అవసరం పడతాయి. ఎల్లయ్య గూడలో వద్ద ఉన్న 70 వేల మొక్కలు, ములుగు లోని ఆర్టికల్చర్ యూనివర్సిటీ పక్కకున్న నర్సరీలో ఒక్క లక్ష 71 మొక్కలు ఉండగా రంగనాయక సాగర్ జలాశయం వద్ద నర్సరీలో నాలుగు లక్షలకు పైగా ఆయిల్ ఫామ్ మొక్కలు ఉన్నాయి. ఇందులో భాగంగానే జిల్లాలో ఇప్ప టికే గడిచిన మూడేళ్లల్లో ఆయిల్ ఫామ్ 11,104 ఎకరాల్లో సాగు చేయించారు. ఈ ఏడాది కొత్తగా 4వేల ఎకరాల్లో సాగును విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 2,670 మంది రైతుల నుంచి దరఖాస్తులు రాగా, వీటిల్లో కొన్నింటికి ఆమోదం పలికి 800 ఎకరాల్లో మొక్కలు నాటి పనులను ప్రారంభించారు.

పండగలకు ఊరెళ్ళితే జాగ్రత్తలు వహించాలి



- రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి

నవతెలంగాణ-రాయపోల్

చోరీల నివారణ కొరకు రాయపోల్ పోలీస్ శాఖ తరపున పలు సూచనలు చేయడం జరుగుతుందని రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా సరే దసరా పండగకు ఊర్లకు వెళ్లాల్సివస్తే విలువైన బంగారం, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి సెక్యూరిటీ అలారం, మిషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవాలి. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళం అమర్చుకోవాలి. స్థానికులకు పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి లేదా డయల్ 100 కు ఫోన్ చేయాలి. వాహనాలను తమ ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోవాలి.ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయాలి. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలు ఆన్లైన్లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి. సోషల్ మీడియాలో మీరు వెళ్లే ప్రాంతం ప్రయాణం ఎన్ని రోజులు వెళ్తున్నారు అనే వివరాలు తెలియజేయవద్దని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే శాంతిభద్రతలు నేరాలు అదుపు చేయవచ్చున్నారు.

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

- మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్

నవతెలంగాణ-దుబ్బాక



గురువారం జరగబోయే సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కమిషనర్ కే.రమేష్ కుమార్ చెప్పారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గల చెరువుల వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. రూ.15 లక్షలతో బతుకమ్మ సంబరాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయిస్తున్నామన్నారు. చెరువుల వద్ద ఎల్ఈడీ లైట్లు బిగించి, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. మున్సిపల్ ప్రజలు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ సంబరాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది బూస ప్రవీణ్, దిలీప్ పలువురున్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర శాఖలో మండల నాయకులకు చోటు

నవతెలంగాణ-తొగుట



పీఆర్టీయూ రాష్ట్ర శాఖలో మండల నాయకులకు చోటు కల్పించడం హర్షణీయం అని మండల అధ్యక్షులు పుల్లగుర్ల రామచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సురేందర్ రెడ్డిలు అన్నారు. మంగళవారం ప్రెస్ నోటు ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం పీఆర్టీయూ రాష్ట్ర శాఖకు జరిగిన ఎన్నికల్లో మండలం నుంచి రాష్ట్ర శాఖలో హనుమా రెడ్డి, నాగిరెడ్డి, అంజిరెడ్డి గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్లారెడ్డి జప్తిలింగారెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, రమేష్, సుధాకర్ వెంకటరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంకటగౌరారెడ్డి కాన్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాష్ట్ర కార్యదర్శులుగా ఎస్ లక్ష్మయ్య గణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కిష్టయ్య కాన్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌరీ శంకర్ రెడ్డి ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్ర శాఖలో స్థానం కల్పించడం శుభసూచకం అన్నారు. జిల్లా, రాష్ట్ర శాఖకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళ మృతి

నవతెలంగాణ-రాయపోల్



ఫైల్

ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడగా వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన రాసమల్లు సూరమ్మ (55).రాయపోల్ మండల కేంద్రంలో వారి కుమారుడు మామయ్య బిక్షపతి మూడు రోజులు క్రితం మృతిచెందగా, సోమవారం మూడు రోజుల కార్యక్రమానికి వెళ్లారు. జాలిగామ గ్రామానికి చెందిన బ్యాగరి మహేష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో లింగారెడ్డి పల్లి గ్రామ శివారులోకి రాగానే సూరమ్మ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై జారి కింద పడింది. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం సూరమ్మను ఢీకొని పైనుంచి వెళ్ళింది. ఈ ప్రమాదంలో సూరమ్మ తలకు, భుజానికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి చూసేసరికి సూరమ్మ అప్పటికే మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త రాసమల్లు రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్

- ప్రధాన కార్యదర్శిగా పుర్మ ఆగంరెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా కొమురవెల్లి మండలం ఐనపూర్ గ్రామానికి చెందిన మేరుగు శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చేర్యాల పట్టణానికి చెందిన పుర్మ ఆగం రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా వీరన్నపేట గ్రామానికి చెందిన మంజె మల్లేశం నియమితులయ్యారు. టీపీసీసీ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి నియామకపు పత్రాలను జారీ చేయగా మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేతులమీదుగా నియమకపత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము రవి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి కత్తి కార్తీక పరామర్శ

నవతెలంగాణ-దుబ్బాకరూరల్



అక్బర్ పేట-భూంపల్లి మండలం చౌదర్పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమార్ గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ మంగళవారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చౌదర్పల్లి గ్రామ అధ్యక్షులు రాజు, మాజీ సర్పంచ్ కొత్త రామానుజన్, సీనియర్ నాయకులు కొత్త దేవి రెడ్డి, మహేందర్ గౌడ్, వెంకటరెడ్డి, బోరు పోచయ్య, కుమ్మరి శ్రీనివాస్, నగేష్, దుబ్బరాజమ్, అంజయ్య, కామోజీ అనురాధ తదితరులున్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తొగుట



పీఏసీఎస్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ తండ్రి సీనియర్ కాంగ్రెస్ నాయకులు యెన్నం మల్లారెడ్డి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు డైరెక్టర్‌ను ఆయన సోదరుడు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెరుకు విజయ్ రెడ్డి (అమర్), యెన్నం భూపాల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, గంట రవీందర్, పబ్బతి మల్లా రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, మల్లయ్య, కనకయ్య, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన జంగపల్లి నాగమణి, రేపాక స్వప్న, సుతారి రజిత, రేపాక స్వాతిలకు మంజూ రైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సంక్షేమమే లక్ష్యంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిట్ల వెంకటయ్య, జీడిపల్లి గోవర్ధన్ రెడ్డి, బండారు స్వామి గౌడ్, పాత్కుల స్వామి, ఈదుగళ్ళ పర్శ రాములు, పాత్కుల బాలేష్, పిట్ల వెంకటేష్, తదితరులు ఉన్నారు.

రాజీవ్ రహదారిపై ఢీ కొట్టుకున్న వాహనాలు

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై మంగళ వారం వరుసగా వెళ్తున్న వాహనాలు ఢీకొట్టుకున్నాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ సైడ్ తీసుకోవడానికి బ్రేక్ చేస్తూ వెళ్తుండగా వెనుకనే వస్తున్న బస్సు వ్యాన్‌ను ఢీ కొట్టింది. బస్సు వెనకాలే వస్తున్న కారు బస్సును ఢీ కొట్టింది. వ్యాన్ ముందుగా వెళ్తున్న కారు నుఢీ కొట్టింది. వాహనాలు ధ్వంసమయ్యాయి. కానీ ఎవరికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు.

పేరుకే మీ సేవ..అందినకాడికి దోపిడి...?

- అక్రమాలకు కేంద్రాలుగా 'మీ సేవ'..
- ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంలో ప్రధాన భూమిక
- అక్రమాలకు అండంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది





నవతెలంగాణ-బెజ్జంకి

ప్రజలకు సత్వర సేవలను సులభతరం చేయడానికి ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాలు ప్రస్తుతం ప్రజా సమస్యలకు, భూ సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. భూ సమస్యలను ఆసరాగా చేసుకుని పలువురు మండలంలోని అయా గ్రామాల్లోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రుపొందించిన ధరణి వల్ల భూ సమస్యలను సత్వర పరిష్కారించుకునే వెసులుబాటు అందుబాటులో లేకపోవడం వల్ల భూ యాజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకునేందుకు భూ యాజమానులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రుణాలను తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్న భూ యాజమానుల అవసరాలను ఆసరాగా చేసుకుని మీ సేవ కేంద్రాల నిర్వహకులు అందినకాడికి దోపిడి చేస్తున్నారని వినికిడి. మీ సేవ కేంద్రాల నిర్వాహకుల అక్రమాలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సహాయసహాకారాలు మెండుగా అందిస్తున్నారని సమాచారం. ప్రభుత్వ భూములు పట్టా భూములుగా మార్చడంలో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అత్యంత కీలకంగా మారారని పలువురు బాధితులు చెబుతున్నారు.

-ఎండ్లుగా తహసిల్లోనే తిష్ట..

తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తించిన సిబ్బంది అందరూ బదిలీపై వెళ్లారు. ఇద్దరు మహిళ సిబ్బంది బదిలీ అవ్వకుండా ఎన్నో ఎండ్లుగా తహసిల్లోనే తిష్ట వేశారు. తహసీల్లో ప్రభుత్వ భూములు, సమస్యలున్న భూముల వివరాలను సేకరించి మీ సేవ కేంద్రాల నిర్వహకుల మధ్యవర్తిత్వంతో పట్టాలుగా మార్పిడి చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఎన్నో ఎండ్లుగా తహసీల్లోనే తిష్ట వేసిన మహిళ సిబ్బందిని వేంటనే బదిలీ చేస్తే మరిన్ని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవ్వకుండా రక్షించు కోవచ్చునని పలువురు అధికారు లకు సూచిస్తున్నారు.



దృష్టికి తీసుకువస్తే చర్యలు..

తహసీల్ సిబ్బంది మీ సేవ కేంద్రాల నిర్వహకులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోప ణలపై దృష్టి సారిస్తాం. మీ సేవ కేంద్రాల నిర్వహ కులు అక్రమాలకు పాల్పడుతున్నట్టు బాధితు లేవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపడుతాం.

-శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్, బెజ్జంకి.

-మీ సేవ పేరుతో అక్రమాలు..!

మండల కేంద్రంలో మీ సేవ పేరునా బోర్డ్ ఏర్పాటుచేసి అక్రమాలకు పాల్పడుతున్నట్టు పలువురు బాహటంగానే చెబుతున్నారు. అధికారులతో మాట్లాడి భూముల సమస్యలను పరిష్కరిస్తామని అమాయక రైతులను బురిడి కొట్టించడమే ధ్యేయంగా నిర్వహకుడు మీ సేవ కేంద్రం ఏర్పాటుచేసినట్టు స్థానిక యవకులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-మీ సేవ కేంద్రం నిర్వహకుల లీలలు..

2017 సెప్టెంబర్ 7న జారీ చేసిన 13 బీ నమునా దృవపత్రం ఆర్ఓఆర్ నెం.2541/2017 ఉండగా 2017 డిసెంబర్ 23న జారీ 13 బీ నమునా దృవపత్రం ఆర్ఓఆర్ నెం.బీ/2535/2017 నమోదు చేయడంపై మీ సేవ కేంద్రాల నిర్వహకుడి లీలలపై అనుమానాలు తలెత్తుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.

రూ.30 వేలు తీసుకుని దృవపత్రం అందజేశారు

మండల పరిదిలోని కల్లేపల్లి గ్రామ శివారులోని 1055/ఇ సర్వే నంబర్ యందున్న 2 ఎకరాల భూమిని అంబటి శౌరి ప్రమీల ప్రమేయం లేకుండా మీ సేవ కేంద్రం నిర్వహకులు అక్రమంగా పట్టా చేయించారు. మాకు బ్యాంక్ రుణం కోసం 13 బీ నమునా దృవపత్రం అవసరమవ్వడంతో 159/సీ, 161/బీ, 164/బీ సర్వే నంబర్ యందున్న సుమారు 2.22 ఎకరాల భూమికి బేగంపేట గ్రామంలోని మీ సేవ కేంద్రం నిర్వహకుడు రూ.30 వేలు తీసుకుని దృవపత్రం అందజేశాడు. తహసీల్దార్ కార్యలయ సిబ్బంది కనుసన్నుల్లో అక్రమ దృవపత్రాలు రుపోందుతున్నాయి. మీ సేవ కేంద్రంపై అధికారులు దృష్టి సారిస్తే తహసీల్దార్ పోర్జరీ సంతకాలతో దృవపత్రాలు బయటపడుతాయి.

-అంబటి ప్రదీప్, గుంటూర్ పల్లి గూడెం

ఘనంగా బతుకమ్మ వేడుకలు











నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో మంగళవారం మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సుల బృందం బతుకమ్మ వేడుకలను కోలాహలంగా చేసుకున్నారు. ఈ సంబరాల్లో డా.స్రవంతి, డా. సాయిశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్ బెర్నమ్మ శాంతకుమారి, పలువురు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొండపాక: మండల కేంద్రమైన కొండపాక, దమ్మకపల్లి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇక్కడ ఏడవ రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. ఏడు అనే సంఖ్య కొండపాకకు సెంటిమెంటుగా వస్తుంది. ఏడు కొండలు, ఏడు దేవాలయాలు, ఏడు నాభి శిలలు, ఏడు గుట్టలు, ఏడు చెరువులు ఉండడం కొండపాకకు ప్రత్యేకత. అందుకోసమే ఇక్కడ ఏడవ రోజునే సద్దుల బతుకమ్మను జరపడం ఆనవాయితీగా వస్తుంది. తీరొక్క పూలను సేకరించి పెద్ద బతుకమ్మలను పేర్చి పలు కూడళ్లలో పెట్టి మహిళలు, కొండపాక శివాలయం వద్ద సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు చిట్టి మాధురి, మాజీ ఎంపీపీ మంచాల అనసూయ బతుకమ్మ ఆడారు. అనంతరం గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా సిద్దిపేట ఆర్డీఓ సదానందం పాల్గొని అధికారులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. అదే విధంగా మహిళా తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ వేడుకల్లో సిద్దిపేట డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహశీల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

నంగునూరు: నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామంలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా చేసుకున్నారు. ఉదయాన్నే తీరొక్క పువ్వులు తెచ్చి పోటీపడి పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చారు. ఈసారి బతుకమ్మకు తంగేడు, గునుగు పువ్వు కొరత ఉండడంతో ఎక్కువ శాతం బంతి పువ్వుల మీదనే ఆధారపడ్డారు. నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో 9వ రోజు సద్దుల బతుకమ్మ పండుగ చేసుకుంటే రాజగోపాలపేట గ్రామంలో మాత్రం ఏడవ రోజు సద్దుల బతుకమ్మ చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు పట్టు వస్త్రాలు ధరించి ప్రధాన వీధుల్లో ఆట పాటలతో మునిగిపోయారు. బతుకమ్మ ఆటలు అనంతరం పెద్ద చెరువు వద్ద బతుకమ్మలతో ర్యాలీగా వెళ్లి నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మకు పండుగకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రంగురాజు గౌడ్, కమాల్ షరీఫ్, పరమాండ్ల మల్లేశం, మహిళా సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని నోట్లతో అలంకరణ

నవతెలంగాణ-సిద్దిపేట



స్థానిక ఆర్యవైశ్య భవనంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవముల సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించినట్లు వైశ్య భవన్ అధ్యక్ష కార్యదర్శులు అయిత బాల రాజేశం, పోశెట్టి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ..ప్రతిరోజు వివిధ రూపాలలో అమ్మవారికి అలంకరణలో భాగంగా కరెన్సీ రూపాయలతో అలంకా రం చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజలు, హోమం జరుగుతున్నాయని, ప్రతిరోజు రాత్రి 8 గంటల నుంచి అమ్మవారి పల్లకి సేవ, ప్రత్యేక సప్త హారతులు, అనంతరం అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైశ్య భవన్ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, అశోక్, శ్రీనివాస్, రవి, రాజేశం, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చన కార్యక్రమానికి హాజరై దుర్గామాతను దర్శించుకున్నారు.

ఆనాటి పది పైసల నాణాలతో అమ్మ వారి అద్భుత రూపం

నవతెలంగాణ-గజ్వేల్



దుర్గాదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకుని కంటికి కనిపించని ఆనాటి అరుదైన 1984 నాటి పది పైసలను ఉపయోగించి ఆధ్యాత్మిక కళానైపుణ్యంతో అమ్మవారి అద్భుత రూపాన్ని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యకులు, రామకోటి రామరాజు మంగళవారం రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆనాటి పది పైసలు ఇప్పుడు చూద్దామన్న దొరకవు కాబట్టి అమ్మ వారి చిత్రం రూపంలో చూస్తున్నమన్నారు. ఈ అరుదైన పది పైసల సేకరింకచడం శ్రమతో కూడుకున్న పని అన్నారు. అమ్మ దయతోనే సేకరించి అమ్మ వారి చిత్రాన్ని వినూతనంగా వేశానన్నారు.భక్తులు తిలకించి ఎప్పుడో ఈ నాణాలను చూశామని ఇప్పుడు రామకోటి రామరాజు చిత్రించిన ఈ చిత్రంలో ఇప్పుడు చూస్తున్నమన్నారు.

ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ సంతోషి మాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసా గుతున్నాయి. మంగళవారం సంతోషి మాత ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. పురోహితులు దేశపతి రాజశేఖర శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమార్చన, లక్ష పుష్పార్చన నిర్వహించారు. మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి అనసూయ దంపతుల ఆధ్వర్యంలో, కీర్తిశేషులు ఎన్‌సీ రాజయ్య జ్ఞాపకార్థం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని అమ్మ అనుగ్రహంతో అందరూ బాగుండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ఎన్‌సీ సంతోష్, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, సంతోషిమాత ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

హనుమాన్ సేవ సమితి ఆధ్వర్యంలో కుంకుమార్చన



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయపల్లి గ్రామం లోని హనుమాన్ సేవ సమితి ఆధ్వర్యంలో దేవి శరన్నవ రాత్రుల్లో భాగంగా మంగళవారం గ్రామ మహిళలతో ఘనంగా కుంకు మార్చన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కుంకుమార్చన సామాగ్రి దాత చేర్యాల రమాదేవి -రాజు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు. హనుమాన్ సేవా సమితి యూత్ సభ్యులు నాకు ఈ అవకాశాన్ని కల్పించినదుకు వారికి పూజా కార్యక్రమం పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసిన మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు అజయ్ శర్మ హనుమాన్ సేవ సమితి సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ ప్రసన్న నగర్‌లో కుంకుమార్చన

నవతెలంగాణ-గజ్వేల్

దేవి నవరాత్రుల ఉత్సవాల భాగంగా మంగళవారం గజ్వేల్ లక్ష్మీ ప్రసన్న నగర్‌లో కుంకు మార్చన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. స్థానిక కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, మాజీ సర్పంచ్ ఉప్పల పద్మ, కాలనీ చైర్మెన్ సదానందం ఆధ్వరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో నివసిస్తున్న మహిళలు పెద్ద ఎత్తున

అమ్మవార్లను దర్శించుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపటరూరల్

దేవి శరన్నవరాత్రోత్సవాలు భాగంగా సోమవారం రాత్రి సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాంపల్లి, బచ్చా యిపల్లి నారాయ ణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ బంజేరుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గ దేవి అమ్మవార్లను వంగ రాజేశ్వర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆయనకు గ్రామంలోని యువత సాదరంగా ఆహ్వానించగా మాణిక్యాల తో మహిళలు హారతి ఇవ్వగా గ్రామ ప్రజలు డబ్బు చప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. నన్ను మీ గ్రామానికి ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉంది. దుర్గ దేవి ఆశీస్సులతో మీరు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అందరూ ఉండాలని మనసారా కోరుకుంటున్నాను. మీరందరూ ఆహ్వానిచినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు.

దుర్గామాతను దర్శించుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

నవతెలంగాణ-తొగుట



దేవి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో దుర్గామాతను దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 5 ఏండ్ల నుంచి అంగరంగా వైభవంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం హర్షణీయం అన్నారు. 9 రోజులపాటు అమ్మవారి పూజలు నిర్వహించి విజయదశమి పండుగ కలిసి మెలసి నిర్వహించుకోవలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, సీనియర్ నాయకులు రాములు, స్వామి చరణ్, ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు ప్రవీణ్, భాను, ప్రశాంత్, కమిటీ సభ్యులు పోతరాజు రవి, కలేపు యాదగిరి, నర్సింలు, స్వామి తగతరులు పాల్గొన్నారు.



యూత్ సభ్యుల ఆధ్వర్యంలో దేవి శరన్నావరాత్రోత్సవలు

-అమ్మవారికి కత్తి కార్తీక ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బర్ పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో దేవి శరన్నావరాత్రోత్సవలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మండపం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దయతో ఈయేడు నియోజకవర్గంలోని రైతులకు పంటలు సమ ృద్ధిగా పండి సకలశుభాలు కలగాలని ఆకాంక్షించారు. అలాగే దుబ్బాక ప్రజలపై అమ్మవారు కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. అంతకముందు యూత్ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, శాలువాతోసత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఏనకుర్తి గ్రామ అధ్యక్షులు రాక్యం శ్రీనివాస్, బీఆర్ఎస్ చౌదర్పల్లి గ్రామ అధ్యక్షులు రాజు, మాజీ సర్పంచ్ కొత్త రామానుజన్, రవీందర్ రెడ్డి, చిన్న ముత్యాల రవి, నరసింహారెడ్డి, తదితరులున్నారు.

ఘనంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-వర్గల్



మండలంలోని తునికి ఖల్సా గ్రామ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాజ రాజేశ్వరి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కౌండిన్య యూత్ సభ్యులు మాట్లాడుతూ..దేవి శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నామని, రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, నిర్వహిస్తున్నని తెలిపారు.